


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
PEN POWER TELUGU DAILY
ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 11 సంచిక :126 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 10 జనవరి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :126 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 10 JANUARY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# హ్యూమన్ సైకాలజీ తెలియదా?

## టీటీడీ ఈవో, జిల్లా కలెక్టర్, ఎస్పీలపై చంద్రబాబు ఆగ్రహం

### తిరుపతి మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల సాయం... కాంట్రాక్టు ఉద్యోగాలు

- తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ పంపిణీ కేంద్రాల వద్ద తొక్కిసలాట
- ఆరుగురి మృతి... 35 మందికి గాయాలు
- తిరుపతిలో చంద్రబాబు ప్రెస్ మీట్
- తిరుపతి తొక్కిసలాట ఘటనాస్థలిని పరిశీలించిన చంద్రబాబు
- పరిమితికి మించి భక్తులను ఎలా అనుమతించారని ప్రశ్న
- భక్తులు పెరుగుతుంటే ఏం చేస్తున్నారని మండిపాటు
- పద్ధతి ప్రకారం పని చేయాలని హెచ్చరిక
- తమాషా అనుకోవద్దని సీరియస్ వార్నింగ్





పెన్ పవర్ డెస్క్:తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం తెలిసిందే. నేడు తిరుపతి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులపై నిప్పులు చెరిగారు. ఘటన స్థలిని స్వయంగా పరిశీలించిన ఆయన, ఆసుపత్రిలో క్షతగాత్రులను ఓదార్చారు. ఈ ఘటనలో ఇద్దరు ఉన్నతాధికారులను సస్పెండ్ చేసిన చంద్రబాబు... మరో ముగ్గురు అధికారులపై బదిలీ వేటు వేశారు. ఈ సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించిన చంద్రబాబు... కీలక నిర్ణయాలు ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున టీటీడీ ద్వారా ఆర్థికసాయం అందిస్తామని

వివరాలు 2లో..

## తిరుపతిలో తొక్కిసలాట ప్రాంతాన్ని పరిశీలించిన పవన్ కల్యాణ్

- తిరుపతిలో తొక్కిసలాట
- ఆరుగురు భక్తుల మృతి
- రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా బైరాగిపట్టెడ వెళ్లిన పవన్
- అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న వైనం



పెన్ పవర్ డెస్క్:విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... నేరుగా తిరుపతి బైరాగిపట్టెడలోని పద్మావతి పార్కు వద్దకు చేరుకున్నారు. తిరుపతిలో నిన్న రాత్రి పద్మావతి పార్కు వద్ద ఉన్న వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ జారీ కేంద్రం వద్ద తొక్కిసలాట జరిగి పలువురు భక్తులు మృతి చెందడం తెలిసిందే. ఈ నేపథ్యంలో... పవన్ కల్యాణ్ తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, డీఎస్పీ చెంచుబాబులతో మాట్లాడారు.పవన్ కాసేపట్లో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించనున్నారు.

## తిరుపతి తొక్కిసలాట ఘటన... చంద్రబాబుపై రోజా తీవ్ర వ్యాఖ్యలు

- చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా చావులే ఉంటాయన్న రోజా
- చంద్రబాబు, బీఆర్ నాయుడు, జిల్లా ఎస్పీలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్
- పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్న



వివరాలు 2లో..

## తిరుపతి ఘటనలో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసిన సీఎం చంద్రబాబు

- తిరుపతిలో గత రాత్రి తొక్కిసలాట... ఆరుగురు భక్తులు మృతి
- పెద్ద సంఖ్యలో భక్తులకు గాయాలు
- క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన సీఎం చంద్రబాబు
- ఆసుపత్రిలో క్షతగాత్రులకు పరామర్శ
- అనంతరం మీడియా సమావేశం
- డీఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు

## మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్



- సుక్మా, బీజాపూర్ జిల్లాల అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- ఉదయం మొదలైన ఎన్‌కౌంటర్
- ఇంకా కొనసాగుతోందని అధికారుల వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టు లు, భద్రతా దళాల మధ్య గురువారం మరో ఎన్‌కౌంటర్ జరుగుతోంది. సుక్మా, బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఈ ఎదురుకాల్పులు జరుగుతున్నాయని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. మూడు దళాల భద్రతా సిబ్బందితో కూడిన ఒక జాయింట్ టీమ్ యాంటీ-నక్సలైట్ ఆపరేషన్ చేపడుతోందని, ఈ క్రమంలో గురువారం ఉదయం కాల్పులు మొదలయ్యాయని తెలిపారు. డీఆర్ఎస్

వివరాలు 2లో..

## లండన్ కు వెళ్లేందుకు జగన్ కు సీబీఐ కోర్టు అనుమతి




- లండన్ లో చదువుకుంటున్న జగన్ కుమార్తెలు
- కుమార్తె గ్రాడ్యుయేషన్ డేకు హాజరవుతున్న జగన్
- ఈ నెల 11 నుంచి 30 వరకు లండన్ వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతి

పెన్ పవర్ డెస్క్: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ విదేశీ పర్యటనకు అడ్డంకులు తొలగిపో యాయి. ఆయన లండన్ వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతించింది. ఈ నెల 11 నుంచి 30వ తేదీ వరకు లండన్ కు వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జగన్ కుమార్తెలు లండన్ లో

వివరాలు 2లో..

## నేడు తిరుపతికి సీఎం రేవంత్‌రెడ్డి..



సీఎం రేవంత్ రెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ( జనవరి 10, 2025 ) సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంతో కలిసి శ్రీవారిని దర్శించుకోనున్నారు. బుధవారం తిరుపతిలో జరిగిన తొక్కిసలాట కలకలం రేపిన

వివరాలు 2లో..

## అధికారులను తిట్టి చంద్రబాబు సాధించిందేముంది?

- చంద్రబాబు వైఫల్యం వల్లే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారన్న అంబటి
- టీటీడీ ఈవో, జేఈవోలకు టీటీడీకి సేవ చేయడమే ముఖ్యమని విమర్శ
- పవన్ ఇంతవరకు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్న



వివరాలు 2లో..

## తిరుమల లడ్డూని రాజకీయం చేశారు... అందుకే ఇలా జరిగింది

- తిరుపతి ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్న అమర్ నాథ్
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏం చెపుతారని ప్రశ్న



పెన్ పవర్ డెస్క్:తిరుపతి తొక్కిసలాట ఘటనపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ తనదైన శైలిలో స్పందించారు. తొక్కిసలాట ఘటన చాలా దురదృష్టకరమని ఆయన అన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని... మృతి చెందిన కుటుంబాలకు

వివరాలు 2లో..

## అధికారికంగా జైపాల్ రెడ్డి జయంతి వేడుకలు.. ఏర్పాట్లకు సీఎస్ ఆదేశం



పెన్ పవర్ డెస్క్:జనవరి 16వ తేదీన మాజీ కేంద్రమంత్రి, దివంగత ఎస్. జైపాల్ రెడ్డి 83వ జయం తిని.... అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు సీఎస్ శాంతి కుమారి. నెక్లెస్ రోడ్ లో

వివరాలు 2లో..

# సంక్రాంతి పండుగకు సొంతళ్లూకు పయనమవుతున్న ప్రజలు...

## బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిట

- విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు
- హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి ఏపీకి వస్తున్న ప్రజలు
- విజయవాడలో బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద విపరీతమైన రద్దీ
- హైదరాబాద్ నుంచి విజయవాడకు భారీగా తరలివస్తున్న ప్రజలు



వివరాలు 2లో..

## తిరుపతి ఘటన ప్రమాదమా... కుట్రా... అనేది విచారణ జరుపుతున్నాం

- తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ కేంద్రాల వద్ద తొక్కిసలాట
- ఆరుగురు భక్తుల మృతి
- మృతుల కుటుంబసభ్యులను పరామర్శించిన ఏపీ మంత్రుల బృందం
- ఘటనలో ఎవరి వైఫల్యం ఉందో సీసీ కెమెరాల ద్వారా తెలుస్తుందన్న అనిత

పెన్ పవర్ డెస్క్:తిరుపతి తొక్కిసలాట ఘటనలో మృతి చెందినవారి కుటుంబ సభ్యులను ఏపీ మంత్రుల బృందం ఈ మధ్యాహ్నం పరామర్శించింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రు లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుపతి ఘటన ప్రమాదమా, లేక ఇందులో ఏదైనా కుట్ర కోణం ఉందా? అనేది విచారణ జరుపుతున్నామని



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# వరుస రైతుల ఆందోళనల వెనుక రాజకీయమా...

రైతుల ఆందోళనకు తలొగ్గి గతంలో వెనక్కి తీసుకున్న మూడు సాగు చట్టాల్లోని అంశాలకు వేరే ముసుగులు తగిలించి తిరిగి ప్రవేశపెట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎత్తులు వేస్తున్నదా? అప్పట్లో వాటి రద్దు సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఇప్పుడు పోరాడుతున్న రైతులు ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోసం పంజాబ్–హర్యానా సరిహద్దుల్లోని శంభు వద్ద రైతులు పది నెలలుగా ఆందోళన చేస్తుంటే వారితో చర్చలకు ముందుకు రాకపోగా, ఇప్పుడు రద్దు చేసిన సాగు చట్టాలకు మించిన భయంకరమైన యంత్రాంగాన్ని మరో రూపంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించడం రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నది. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి రైతు నేత, క్యాన్సర్ వ్యాధి గ్రస్తుడు 70 ఏళ్ల జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరశన దీక్ష చేపట్టడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. . పంజాబ్ హర్యానా సరిహద్దు లోని ఖనౌరీ శిబిరం వద్ద ఆయన దీక్ష ప్రారంభించడంతో రైతులు గత కొన్నాళ్లుగా సాగిస్తున్న ఆందోళన కొత్త మలుపు తిరిగి మరింత బలోపేతం అయింది. రానురాను ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో సమీప ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలని పంజాబ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది.. అయితే దల్లేవాల్‌కు వైద్యం అందించడానికి వెళ్తే రైతు సంఘాలు అడ్డుకుంటున్నాయని పంజాబ్ ప్రభుత్వం చేతులెత్తేసిందిఇదే సమయంలో దల్లేవాల్ నిరశన దీక్షకు సుప్రీం కోర్టు జోక్యంతో బ్రేక్ పడుతోందన్న తప్పుడు అభిప్రాయం దుమారం రేపింది. ఈ అపనింద పడడంతో పంజాబ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు మందలించింది. తాము దల్లేవాల్ ఆరోగ్యంపై ఆందోళన చెందుతున్నాం తప్ప ఆయన నిరశన దీక్షకు ఎక్కడా బ్రేకు వేయలేదని వైద్యం తీసుకుంటూ నిరశన దీక్ష సాగించవచ్చని స్పష్టం చేసింది. ఇది అందరికీ తెలియజెప్పాలని పంజాబ్ ప్రభుత్వానికి సూచించింది. ఇదిలా ఉండగా తమ డిమాండ్లకు కేంద్రం ఒప్పుకుంటేనే దల్లేవాల్ నిరసన దీక్షను విరమిస్తారని రైతు నాయకులు సుప్రీం కోర్టుకు స్పష్టం చేశారు. రైతుల రుణమాఫీ , స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు కనీస మద్దతు ధరకుచట్టబద్ధత , మూడు వ్యవసాయ చట్టాలపై గతంలో ఆందోళన సాగించిన రైతులపై ఉన్న కేసులను ఎత్తి వేయడం ఇవన్నీ నెరవేర్చాలని సంయుక్త కిసాన్ మోర్చా, భారతీయ కిసాన్ యూనియన్( ఏక్తా యుగ్రహాన్ ) తదితర ప్రధానవ్యవసాయ సంఘాలు ఎంతగా అభ్యర్థించినా ప్రభుత్వాల నుంచి ఎలాంటి చొరవ కనిపించ లేదు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి హామీ ఇవ్వలేని కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ పెంచుతూ ఇటీవల నిర్ణయం తీసుకోవడం రైతులపై కపట ప్రేమ నాటకమే. అమోనియం పాస్ఫేట్ ఎరువుపై అదనపురాయితీ కింద రూ. 3850 కోట్ల వరకు వన్‌టైమ్ ప్యాకేజీగా ఇవ్వడానికి నిర్ణయించినట్టు ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటోంది. ఇక ప్రధాని మోడీ అమాంతం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రగల్భాలు పలుకుతున్నారు. సేద్యానికి ఎరువులు అవసరమే కానీ, పండించిన పంటలే గిట్టుబాటు ధరకు అమ్ముడు పోనప్పుడు ఎరువుల సబ్సిడీ వల్ల రైతులకు ఏం కలిసివస్తుంది ? గతంలో కేంద్రం తీసుకొచ్చిన సాగు చట్టాలను నిరసిస్తూ రైతులు సాగించిన ఉద్యమాన్ని కేంద్రం ఎంతగా ఉక్కుపాదం మోపి అణగదొక్కిందో, ఎలా నేరస్థులను చేసిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు రైతులపై ప్రేమ నటించడం పిల్లి రొయ్యల మొలతాడు కట్టుకుని రుద్రాక్షమాలలు ధరించిన సామెత గుర్తుకు వస్తుంది. ఆనాడు రైతుల ఆగ్రహానికి బెంబేలెత్తిన మోడీ సర్కారు అప్పటికప్పుడు ఆ మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసినట్టు ప్రకటించి చేతులు దులుపుకుంది. కానీ మళ్లీ దొడ్డిదారిన ఆ మూడు వ్యవసాయ చట్టాలను ప్రవేశ పెట్టేందుకు పావులు కదుపుతోందని వార్తలు వస్తున్నాయి. ఈ చట్టాలపై కొత్తగా అభిప్రాయాల సేకరణకు అన్ని రాష్ట్రాలకు కొత్తపాలసీ కాపీలు పంపారని ఆప్ అధినేత కేజ్రీవాల్ ఆరోపిస్తుండటంలో వాస్తవం లేకపోలేదు. నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఆన్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ ముసాయిదా పాలసీని ఇటీవల కేంద్రం ప్రకటించింది. దీనిని దృష్టిలో పెట్టుకునే కేజ్రీవాల్ దాని గుట్టుబయటపెట్టారు. అయితే విధానపరమైన అంశాలు, శాంతిభద్రతలు, రాజకీయాలు ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నప్రస్తుత పరిస్థితుల్లో సుప్రీం కోర్టు విధించిన గడువు , మార్గదర్శకాలు ఏ విధంగా ప్రభావం చూపిస్తాయో అన్నది చర్చకు వస్తోంది. కోర్టులు ఇందులో జోక్యం చేసుకొనే సంగతి ఎలా ఉన్నా ప్రభుత్వాలు మాత్రం తమవంతు బాధ్యతగా, ఇలాంటి ఆందోళనలకు పరిష్కారం చూపించడమే సమంజసం. రైతుల డిమాండ్లు ప్రభుత్వం ముందు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయి. వ్యవసాయ సంక్షోభం బహుముఖాలుగా వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో నెలలు, సంవత్సరాల పాటు శాశ్వతంగా రైతులు ధర్నాలు, నిరసనలు కొనసాగించడం , ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దేశానికి నష్టమే. దల్లేవాలా దీక్ష విరమించాలని వస్తున్న అభ్యర్థనలను ఆయన మద్దతుదారులు పక్కన పెడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అలా అభ్యర్థనలు చేస్తున్నవారు ప్రభుత్వ ఏజెంట్లన్న ముద్ర పడుతోంది. అలాగే కొందరి ఒత్తిళ్ల వల్ల దల్లేవాల్ దీక్షను కొనసాగిస్తున్నారన్న ఆపోహలకు తావీయరాదు. దల్లేవాల్ ఒంటరిగా దీక్ష చేయడం కన్నా ఉమ్మడిగా కొంతమంది రైతులతో కలిసి దీక్ష కొనసాగించడం ఆయన ఆరోగ్యానికి భద్రత కలిగిస్తుందని కొందరు రైతు నాయకులు సలహాలు ఇస్తున్నారు. వీటిని దల్లేవాల్ వర్గీయులు పరిశీలన లోకి తీసుకోవడం అవసరం. ఈ పరిస్థితుల్లో దల్లేవాలా ఆరోగ్యానికి ఎలాంటి ముప్పుకలగబోదని . హర్యానా, పంజాబ్ , కేంద్ర ప్రభుత్వాలు భరోసా ఇవ్వడం తక్షణ కర్తవ్యం. ఎన్‌పీఎఫ్ఏఎం నిస్సందేహంగా రద్దు చేసిన వ్యవసాయ చట్టాలకు 'బ్యాక్ డోర్ ఎంట్రీ' ఇస్తుందని ఎస్‌కేఎం నేత రాజేవా ల్ చెప్తున్నారు. కొత్త ముసాయిదా విధానంతో ప్రైవేటు వ్యాపారులకు గిడ్డంగులు నిర్మించుకునేందుకు అనుమతి లభిస్తుందని, కాబట్టి ఇది ఆమోదయోగ్యం కాదం టున్నారు. ఏది ఏమైనా ఈ పాలసీని వ్యతిరేకించి తీరుతామని రైతులు భీష్మించుక్కూర్చున్నారు. రైతు సంఘాలను మరోమారు ఏక తాటిపైకి తెచ్చి దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని, ఇందుకోసం ఎంతవరకైనా కొట్లాడతామని ఆ సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, రైతులతో చర్చలు ఎప్పుడు ప్రారంభిస్తారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాను మీడియా ప్రశ్నించగా, సుప్రీం కోర్టు సూచనల మేరకు తమ ప్రభుత్వం వ్యవహరిస్తుందని వెల్లడించారు. అంటే కేంద్ర అధిష్ఠాన కటాక్షం పైనే అంతా ఆధారపడి ఉందన్న మాట!

# హ్యూమన్ సైకాలజీ తెలియదా?

- మొదటి పేజీ తరువాయి

ప్రకటించారు. ఆరుగురు మృతుల కుటుంబాల్లో ఒకరికి చొప్పున కాంట్రాక్టు ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఇద్దరికి రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం చేస్తామని చెప్పారు. వారి ఆరోగ్యం మెరుగయ్యే వరకు వైద్య ఖర్చులు భరిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. గాయపడిన మరో 33 మందికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఘటనలో గాయపడిన 35 మందికి తిరుమలలో శ్రీవారి దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. క్షతగాత్రులను వారి స్వస్థలాలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

తిరుపతిలో టికెట్లు ఇవ్వడం గతంలో లేని సంప్రదాయం అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. భక్తులు తిరుమలలో క్యూలైన్లలో ఉంటే దైవ చింతనలో గడుపుతారని వివరించారు. వైకుంఠ ద్వార దర్శనాన్ని 10 రోజులకు పెంచారని, ఎందుకు పెంచారో తెలియదని అన్నారు. ఏదేమైనా, మొదటి నుంచి ఉన్న సంప్రదాయాలు మార్చడం మంచిదికాదని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ పద్ధతులు ఉండాలని అభిలషించారు. రాష్ట్రంలోని ఏ ఆలయంలోనూ అపచారం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

తిరుమల వెంకటేశ్వరస్వామి అంటే ప్రజల్లో భక్తి రోజురోజుకు పెరిగిపోతుందని అన్నారు. పవిత్ర పర్వదినాల్లో స్వామివారిని దర్శించుకోవాలన్న భావన ప్రజల్లో అంతకంతకు పెరుగుతోందని తెలిపారు. పవిత్ర దినాల్లో దర్శనాలు సాఫీగా చేయించాల్సిన బాధ్యత అధికారులదేనని చంద్రబాబు స్పష్టం చేశారు.

గత నాలుగైదేళ్లుగా జరిగిన విషయాలన్నింటినీ ఒక్కొక్కటిగా చక్కదిద్దుకుంటూ వస్తున్నామని... ప్రసాదాలు, అన్నదానం, కాటేజీలు... ఇలా అనేక అంశాలను సరిచేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. ఒకవేళ ప్రభుత్వ పరంగా, అధికారుల పరంగా సామర్థ్యాలు పెంచుకోవాల్సి వస్తే, పెంచుకుంటామని అన్నారు. ఈవో శ్యామలరావుకో, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికో దీన్ని ఆపాదించలేమని, వాళ్లు ఎగ్జిక్యూటివ్ లుగా, ఈయన చైర్మన్ గా వచ్చారు అని వివరించారు. వాళ్లు వేరే వ్యవస్థల నుంచి ఇక్కడికొచ్చారని, వాళ్లు ఇంతకుముందు ఇలాంటి జాబ్ లు చేయలేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అయితే టీటీడీకి విభిన్నమైన కోణాలు ఉన్నాయని... ప్రజల మనోభావాలు, ఇతర సెంటిమెంట్లు ఉన్నాయని, ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని పనిచేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు.

### హ్యూమన్ సైకాలజీ తెలియదా?

తిరుపతిలో తొక్కిసలాట ఘటన చోటు చేసుకున్న ప్రదేశాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరకున్న చంద్రబాబు... అక్కడి నుంచి నేరుగా తిరుపతిలోని బైరాగిపట్టెడ వద్ద ఉన్న ప్రమాదస్థలికి వెళ్లారు. ఆయనతో పాటు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, అనిత, సత్యకుమార్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కూడా ఉన్నారు.

ఈ సందర్భంగా ఘటనకు గల కారణాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. టీటీడీ ఈవో, జేఈవో, జిల్లా కలెక్టర్, ఎస్పీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి అదుపులోనే ఉందని, గేటు తీసిన తర్వాతే తొక్కిసలాట జరిగిందని టీటీడీ ఈవో చెప్పగా... హ్యూమన్ సైకాలజీ ఎలా ఉంటుందో తెలియదా? అని ప్రశ్నించారు. 2 వేల మంది పట్టే స్థలంలో 2,500 మందిని ఎలా ఉంచారని అడిగారు. పరిమితికి మించి భక్తులను ఎలా అనుమతించారని ప్రశ్నించారు. విధులు కేటాయించిన పోలీసు అధికారికి ముందస్తుగా ఎలాంటి జాగ్రత్తలు చెప్పారని ప్రశ్నించారు. ఇంత అధికార యంత్రాంగం ఉండి కూడా టికెట్ల పంపిణీ సరిగా ఎందుకు చేయలేకపోయారని అడిగారు. భక్తుల రద్దీ పెరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఘటనాస్థలానికి అంబులెన్స్ ఎన్ని గంటలకు వచ్చిందని అడిగారు. ఏమీ జరగక ముందే చర్యలు తీసుకుంటే దాన్ని అడ్మినిస్ట్రేషన్ అంటారని... ప్రమాదం జరిగిన తర్వాత ఎంత చేస్తే మాత్రం ఏం ఉపయోగమని అన్నారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటన మరోసారి జరగకుండా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అన్నారు. పద్ధతి ప్రకారం పని చేయాలని, పద్ధతి ప్రకారం పని చేయడాన్ని నేర్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమాషా అనుకోవద్దు అని మండిపడ్డారు. బాధ్యత తీసుకున్నవారు ఆ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు.

# తిరుపతి తొక్కిసలాట ఘటన... చంద్రబాబుపై రోజా తీవ్ర వ్యాఖ్యలు

**పెన్ పవర్ డెస్క్:** టీటీడీ విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తిరుపతి తొక్కిసలాట ఘటన చోటుచేసుకుందని వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా అన్నారు. ఇది కూటమి ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా చావులే ఉంటాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నిర్లక్ష్యం వల్ల గతంలో గోదావరి పుష్కరాల్లో తొక్కిసలాట జరిగిందని అన్నారు. ఇప్పుడు తిరుపతిలో అలాంటి ఘటనే మరోసారి చోటుచేసుకుందని చెప్పారు. చంద్రబాబు అసమర్థ పాలనకు ఇది నిదర్శనమని అన్నారు.

సంధ్య థియేటర్ ఘటనతో అల్లు అర్జున్ కు సంబంధం లేకపోయినా ఆయనపై కేసు పెట్టారని... ఈ ఘటనలో చంద్రబాబు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, జిల్లా ఎస్పీలపై కేసులు పెట్టాలని రోజా డిమాండ్ చేశారు. ఇవి ప్రభుత్వం చేసిన హత్యలేనని అన్నారు. సనాతన యోధుడినని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంతమంది చనిపోతే హైందవ శంఖారావం నిర్వాహకులు ఎక్కడున్నారని అడిగారు. పీఠాధిపతులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

# నేడు తిరుపతికి సీఎం రేవంత్‌రెడ్డి..

- మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో రేవంత్ పర్యటన టీటీడీ భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేసింది. ఇదిలా ఉండగా.. వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుపతి ఏర్పాటు చేసిన టోకెన్ జారీ కేంద్రాల దగ్గర తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ తొక్కిసలాటలో 6 మంది మృతి చెందగా 40 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులకు హాస్పిటల్లో చికిత్స అందిస్తుండగా.. మృతదేహాలకు రుయా హాస్పిటల్లో పోస్టుమార్టం నిర్వహించారు.

ఈ ఘటనపై స్పందించిన సీఎం రేవంత్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తిరుమల వేంకటేశ్వర స్వామి వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల జారీ కౌంటర్ల వద్ద తొక్కిసలాట ఘటనలో పలువురు భక్తులు మరణించిన వార్త తీవ్రంగా కలచివేసిందని... వారి మృతికి సంతాపం తెలియజేస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానంటూ ట్వీట్ చేశారు సీఎం రేవంత్.

# సంక్రాంతి పండుగకు సొంతళ్లూకు పయనమవుతున్న ప్రజలు...

**పెన్ పవర్ డెస్క్:** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో, ప్రజలు సొంతూళ్లకు పయనమవుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి తెలుగు వారు కుటుంబాలతో సొంతూళ్లకు బయల్దేరారు. ఈ నేపథ్యంలో, ఏపీలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. విజయవాడలోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. నగరంలోని నెహ్రూ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ లో విపరీతమైన రద్దీ నెలకొంది. ముఖ్యంగా, హైదరాబాద్ నుంచి విజయవాడకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. కోస్తా జిల్లాలకు, ఉత్తరాంధ్రకు వెళ్లేవారు ఎక్కువమంది ఉండడంతో అధికారులు విజయవాడ నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించారు. విజయవాడ నుంచి పలు ప్రాంతాలకు 114 అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని అధికారులు తెలిపారు. అటు, ప్రయాణికుల తాకిడితో రైల్వే శాఖ కూడా ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది.

# అధికారులను తిట్టి చంద్రబాబు సాధించిందేముంది?

**పెన్ పవర్ డెస్క్:** ముఖ్యమంత్రి చంద్రబాబు వైఫల్యం వల్లే తిరుపతి ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. అధికారులను తిట్టి తన పనైపోయిందని చంద్రబాబు భావిస్తున్నారని... అధికారులపై కోపం చూపించి ఆయన సాధించింది ఏముందని ప్రశ్నించారు. నిర్లక్ష్యం ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. పవిత్రమైన ఏడు కొండలను రాజకీయాలకు దూరంగా ఉంచాలని అంబటి చెప్పారు. తిరుమల చరిత్రలో ఎన్నడూ లేని ఘోర ప్రమాదం ఇదని అన్నారు. టీటీడీ ఈవో, జేఈవోలే ఈ ప్రమాదానికి కారణమని... వారికి టీటీడీకి సేవ చేయాలన్న దృక్పథం కన్నా టీడీపీకి సేవ చేయాలనే తపన ఎక్కువని చెప్పారు. గతంలో జగన్ తిరుమలకు వస్తానంటే పెద్దపెద్ద బోర్డులు పెట్టారని మండిపడ్డారు.

సనాతన ధర్మాన్ని కాపాడే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంతవరకు ఏం మాట్లాడలేదని సెటైర్లు వేశారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు, గాయపడిన వారికి రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటేనే మృతుల ఆత్మలు శాంతిస్తాయని చెప్పారు.

# తిరుమల లడ్డూని రాజకీయం చేశారు... అందుకే ఇలా జరిగింది

- మొదటి పేజీ తరువాయి

రూ. కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూని రాజకీయం చేశారని... అందుకే ఇలాంటి విషాదకర ఘటనలు జరుగుతున్నాయని అందరూ అనుకుంటున్నారని అమర్ నాథ్ చెప్పారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు వైసీపీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామని చెప్పారు.

ప్రధాని మోదీ భజన మానేసి.. తిరుపతిలో భక్తుల సౌకర్యాల మీద దృష్టి సారించి ఉంటే ఇన్ని ప్రాణాలు పోయేవి కాదని అమర్ నాథ్ అన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడే నాయకుడు పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏం చెబుతారని ప్రశ్నించారు. గతంలో సనాతన ధర్మ దీక్షను చేసిన పవన్... ఇప్పుడు ఏ దీక్ష చేస్తారో చూస్తామని అన్నారు. ఏపీకి మోదీ నిన్న ఎలాంటి హామీలు ఇవ్వలేదని విమర్శించారు. మెజార్టీ ప్రాజెక్టులన్నీ గతంలో చెప్పినవేనని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేదని అమర్ నాథ్ దుయ్యబట్టారు.

## తిరుపతి ఘటనలో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసిన సీఎం చంద్రబాబు

తిరుపతి తొక్కిసలాట ఘటనపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ఆసుపత్రిలో క్షతగాత్రులతో మాట్లాడిన అనంతరం సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించారు.

తొక్కిసలాట ఘటనకు బాధ్యులుగా ఇద్దరు ఉన్నతాధికారులను సస్పెండ్ చేశారు. డీఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డిలను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ ఘటనకు సంబంధించి మరో ముగ్గురు అధికారులపై బదిలీ వేటు వేశారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈఓ, టీటీడీ సీఎస్ఓ శ్రీధర్ గౌతమిలను బదిలీ చేశారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం చంద్రబాబు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు తమ నిర్ణయాలు వెల్లడించారు.

## అధికారికంగా జైపాల్ రెడ్డి జయంతి వేడుకలు.. ఏర్పాట్లకు సీఎస్ ఆదేశం

- మొదటి పేజీ తరువాయి

జైపాల్ రెడ్డి మెమోరియల్ స్ఫూర్తి స్థల్ లో సంబంధిత శాఖ అధికారులతో ఏర్పాట్లు చేయాలని %నవీణూ% కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. శానిటేషన్, పార్కింగ్, ట్రాఫిక్ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు సీఎస్. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన దివంగత జైపాల్ రెడ్డి పేరును పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోత పథకానికి పెట్టాలని తెలంగాణ కేబినెట్ ఇటీవల నిర్ణయించిన సంగతి తెలిసిందే.

## మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య ఛత్తీస్‌గడ్‌లో మరో ఎన్‌కౌంటర్

- మొదటి పేజీ తరువాయి

(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), స్పెషల్ టాస్క్ ఫోర్స్, కోబ్రా సిబ్బంది ఉమ్మడిగా ఈ ఆపరేషన్ చేపట్టారని వివరించారు. ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని, తదుపరి సమాచారం అందాల్సి ఉందని అధికారి పేర్కొన్నారు.

కాగా, నవంబర్ నెల నుంచి ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. నక్సల్స్‌కు గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అయితే, ఈ ఎన్‌కౌంటర్లకు ప్రతీకారంగా మావోయిస్టులు ఇటీవల భద్రతా సిబ్బంది ప్రయాణిస్తున్న ఓ వాహనాన్ని ఐఈడీతో పేల్చివేశారు. ఈ ఘటనలో 9 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. 2026 నాటికి నక్సల్స్ రహిత్ దేశాన్ని ఆవిష్కరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రతినబూనింది. ఈ క్రమంలో యాంటీ నక్సలైట్ ఆపరేషన్లు విస్తృతంగా జరుగుతున్నాయి.

## తిరుపతి ఘటన ప్రమాదమా... కుట్రా... అనేది విచారణ జరుపుతున్నాం

- మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులకు ఎవరి వైఫల్యం కారణం అనేది సీసీ కెమెరా ఫుటేజి ద్వారా తెలుస్తుందని అన్నారు. ఈ ఘటనకు కారకులు ఏ స్థాయిలో ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని అనిత స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని తెలిపారు.

## లండన్ కు వెళ్లేందుకు జగన్ కు సీబీఐ కోర్టు అనుమతి

- మొదటి పేజీ తరువాయి

చదువుకుంటున్న సంగతి తెలిసిందే. తన కుమార్తె గ్రాడ్యుయేషన్ డే కోసం లండన్ వెళ్లేందుకు అనుమతించాలని సీబీఐ కోర్టును జగన్ కోరారు. ఆయన విన్నపం పట్ల సానుకూలంగా స్పందించిన కోర్టు 20 రోజుల పాటు లండన్ వెళ్లేందుకు అనుమతించింది. మరోవైపు, నిన్న హైకోర్టులో జగన్ కు ఊరట లభించింది. జగన్ పాస్ పోర్ట్ పొందేందుకు హైకోర్టు ఎన్వోసీ (నిరభ్యంతర పత్రం) జారీ చేసింది. ఐదేళ్ల కాలపరిమితితో జగన్ కు పాస్ పోర్ట్ ఇవ్వాలని సంబంధిత అథారిటీని ఆదేశించింది. ఎన్వోసీ కోసం జగన్ వేసిన పిటిషన్ ను కొట్టేస్తూ విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# స్కవర్ స్లుయిస్ గేటు మరమ్మతులు చేయిస్తాం



పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, జనవరి 9:** గుమ్మిడి గెడ్డ ఆనకట్ట గెడ్డ వైపు ఉన్న స్కవర్ స్లుయిస్ గేటు (తలుపులు) వినియోగిస్తుండగా ఊడి పడిపోయిందని

కురుపాం నీటిపారుదల ఉప విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజనీరు డి. రవి కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 3వ తేదిన ఒక దినపత్రికలో ప్రచురించిన ఇలా అయితే సాగు నీరు అందేదెలా వార్తకు అయన గురువారం స్పందించారు.

తలుపుల ప్రక్క ఉన్న హేంగలర్స్ ఊడి తలుపు ప్రక్కకు పడిపోవడం వల్ల నీరు గెడ్డలో కలిసిపోతోందని వివరించారు. తాత్కాలికంగా తలుపు మరమ్మతులు జరిపించి, రైతులకు సాగు నీరుని అందిస్తామని అన్నారు.

క్షేత్ర స్థాయిలో గుమ్మిడి గెడ్డ ఆనకట్టను పరిశీలించి, పూర్తి స్థాయి మరమ్మతులకు అవసరమైన అంచనాలను 15 రోజుల్లోగా పై అధికారులకు సమర్పిస్తామని ఆ ప్రకటనలో తెలిపారు.

# మోదీ రోడ్డు షో,సభ సక్సెస్

- ఉత్తరాంధ్ర ప్రజల విజయం,త్రిమూర్తులకు పూల వర్షంతో స్వాగతం
- రూ.2 లక్షల 9వేల కోట్ల వరాలు
- రోడ్డు షో, సభ సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు
- జనసేన నగర అధ్యక్షులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 09** :ఏయూ మైదానంలో బుధవారం నిర్వహించిన ప్రధానమంత్రి మోదీ బహిరంగ సభ, రోడ్ షో సక్సెస్ కావడం ఉత్తరాంధ్ర ప్రజల విజయమని జిల్లా జనసేన అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శివా జీ పాలెం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మోదీ రోడ్ షో, సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరకి ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతం కావడంలో కీలక భూమిక పోషించిన రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, డోలా బాల వీరాంజనేయ స్వామి, అచ్చం నాయుడు, కొల్లు రవీంద్ర, వం గలపూడి అనిత, ఎం పీ.భరత్, స్థానిక ఎమ్మె ల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. అభివృద్ధి త్రిమూర్తులుగా ప్రధాని మోదీ, ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ లకు ప్రజలు పూల వర్షం కురిపించి బ్ర హ్మరథం పట్టారన్నారు. నగర వేది కగా సుమా రు రూ.2 లక్షల 9వేల కోట్ల పనులకు శంకుస్థా పనలు చేసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నాంది పలి కారని కొనియాడారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ రైల్వే జోన్ ను ప్రధాని మోదీ పట్టా లెక్కించారని చెప్పారు.

గత అయిదేళ్లలో అభివృద్ధిలో కుంటిపడిన రాష్ట్రానికి ఏయూ మైదానంలోని బహిరంగ సభ లో మోడీ మందు పూసి పరుగులు పెట్టించా రని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై అసూయతోవై. సీ.పీ నేతలు చేసే విమర్శలకు ఆంధ్రప్రదేశ్ అభి వృద్ధితోనే సమాధానం చెబుతామని పేర్కొన్నా రు.



# పదో తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ



**నర్సీపట్నం, పెన్ పవర్ (జనవరి 09)** :స్థానిక మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నర్సీపట్నం టౌన్ ఎస్ఐ రమేష్, స్కూల్ ప్రిన్సిపల్ రూప ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు హెట్రో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ నక్కపల్లి వారి ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు.

ఈ సందర్భంగా నర్సీపట్నం ఎస్సై రమేష్ మాట్లాడుతూ తన చిన్నతనంలో శ్రీకాకుళం జిల్లాలో గవర్నమెంట్ స్కూల్ నందు చదువుకుని నేను ఈ స్థాయికి వచ్చానని మీరందరూ కూడా బాగా చదువుకుని ఉన్నతమైన స్థానంలోకి రావాలని కోరుతున్నానని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎం. రూప మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఈ పుస్తకాలు నిపుణులైన టీచర్స్ డేటా తయారు చేయించడం జరిగిందని వీటిని చదవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. హెట్రో సంస్థ గత రెండు సంవత్సరాలుగా సి ఎస్ ఆర్ ఫండింగ్ ద్వారా ఈ స్కూలుకు పార్టీ పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు రాంబాబు, సత్తిబాబు, రాజు తదతరులు పాల్గొన్నారు.



# మాచ్ ఖండ్ బ్యాక్ వాటర్ వద్ద పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు

**గిరిజన సంస్కృతి ఉట్టి పడేలా చలి అరకు ఉత్సవం.**

**అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్**

**పాడేరు/ముంచంగిపుట్టు, జనవరి 09.** అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండలం, సుజనకోట గ్రామం మత్స్యగెడ్డ వద్ద మాచ్ ఖండ్ బ్యాక్ వాటర్ వద్ద పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం పర్యాటక అభివృద్ధి, చలి అరకు ఉత్సవం 25 పై కలెక్టరేట్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం సుజన కోట పంచాయతీలో పర్యటించానని, మచ్ ఖండ్ రిజర్వాయర్ కేజ్ కల్చర్, ప్యారా సైలింగ్, పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా ఉందన్నారు. రిజర్వాయరు పరివాహక ప్రాంతంలో 350 మంది వరకు మత్స్యకారులు ఉన్నారని, మత్స్యకారులతో సొసైటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కేజ్ కల్చర్ ఏర్పాటుకు బ్యాంకుల నుండి రుణాలు ఏర్పాటు చేస్తామన్నారు. రూ.5 లక్షల పెట్టుబడితో కేజ్ కల్చర్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేజ్ కల్చర్ ఉపయోగంగా ఉంటుందని అన్నారు.

గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా చలి అరకు ఉత్సవం

గిరిజన సంస్కృతి ఆచార సాంప్రదాయాలు ప్రతిబింబించేలా చలి అరకు ఉత్సవం నిర్వహించాలని చెప్పారు. ఉత్సవం నిర్వహణ ఏర్పాట్లపై పలు ఆదేశాలు జారీ చేసారు. సాంస్కృతిక ప్రదర్శనకు అవసరమై కళాకారుల వివరాలు సేకరించి రవాణా, వసతి సౌకర్యాలు సమకూర్చాలని చెప్పారు. ప్రతీ రోజు నిర్వహించవలసిన కార్యక్రమాలపై చర్చించారు. పుడ్కోర్టులు, ఎమ్యూజ్మెంట్, పార్కింగ్, స్టాల్స్ ఏర్పాట్లపై పలు సూచనలు చేసారు. మొబైల్ టవర్ ఆన్ వీల్స్, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు. గిరిజన మ్యూజియం, గిరి గ్రామ దర్శిని, పద్మాపురం గార్డెన్లను సుందరంగా అలంకరించాలని చెప్పారు. అరకు పట్టణంలో విద్యుత్తు దీపాలు అన్ని వెలిగే విధంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ఐటిడిఏ, పి. ఓ. వి. అభిషేక్ సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, మ్యూజియం మేనేజర్ మురళి, పర్యాటక శాఖ అధికారులు ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

# టీ.టీ.డీ చరిత్రలో ఒక బ్లాక్ డే

- గుడివాడ అమర్నాథ్ మాజీ మంత్రి
- తిరుపతిలో జరిగిన సంఘటన చాలా దురదృష్ట కరం





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం జనవరి 09. :** తిరుపతిలో జరిగిన సంఘటనలో 7 మంది చనిపోవడం బాధాకరం. వైకుంఠ ఏకాదశి ఏర్పా ట్లలో ప్రభుత్వం, టీటీడీ విఫలమయ్యింది. తిరు మలలో 7 మంది మరణాలు ప్రభుత్వ హత్యలే.

టీటీడీ చరిత్రలో ఎన్నడు ఇటువంటి సంఘటన లు జరగలేదు.ఈ మరణాలకు బాధ్యత సీ.ఎం చంద్రబాబు, టీటీడీ ఛైర్మెన్ ది చనిపోయిన వారి కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇ వ్వాలి.గాయపడిన వారికి 20 లక్షలు ఇవ్వాలి..

వెంకన్న చౌదరి టీటీడీ సేవలో ఉన్నారా చంద్రబా బు సేవలో ఉన్నారా,అధికార యంత్రాంగం టీ.టీ డీ విజిలెన్స్ ఏమయ్యాయి.ఈ మరణాలు కూ డా వై.ఎస్ జగన్ మీద వేసేస్తారా,వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో పది రోజుల పాటు వైకుంఠ ఏకాదశి దర్శనం కల్పించింది.వై.ఎస్.జగన్ పాల నలో భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అ న్ని జాగ్రత్తలూ తీసుకున్నారు.టీ.టీ.డీ.ని త మ రాజకీయాలకు కూటమి వాడుకుంది.లడ్డు వ్య వహారాన్ని తెరపైకి తెచ్చి అభాసు పాలయ్యా రు.టి.డి.పి ఏడు నెలల కాలంలో ఇక ప్రాజెక్టు అయిన తెచ్చారా.గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో వచ్చింది.బల్క్ డ్రగ్ పార్క్ వైఎస్ఆర్సీపీ హయాంలో వచ్చింది.బల్క్ డ్రగ్స్ పార్క్ ను టిడిపి నేతలు వ్యతిరేకించారు..

కృష్ణపట్నం హబ్ ను వైఎస్ జగన్ పాలనలో వ చ్చింది,వైఎస్ జగన్ తెచ్చిన ప్రాజెక్టులకు చంద్ర బాబు సొంత డబ్బా కొట్టుకుంటున్నారు.చం ద్రబాబు పవన్ మోడీ బజన చేయడానికి పోటీ పడ్డారు.టీటీడీ మీద శ్రద్ధ పెడితే ఈ మరణాలు జరిగేవి కాదు.ఈ మరణాలు తరువాత పవన్ కళ్యాణ్ ఏమి దీక్ష చేస్తారో చెప్పాలి.సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ ఈ మరణాలు గురించి ఏమీ చెపుతారో చూడాలి.బహిరంగ సభలో ప్రధాని మోడీని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయొద్దని,రాష్ట్ర ప్రయోజనాల కోసం ధైర్యంగా వైఎస్ జగన్ మాట్లాడారు.స్టీల్ ప్లాంట్ కోసం కనీ సం మోడీని చంద్రబాబు పవన్ అడగలేక పో యారు.ఇంక వారేమి స్టీల్ ప్లాంట్ ను కాపాడు తారు అని పలికారు.

# టిడిపికి దాలినాయుడు రాజీనామా



**కురుపాం / పార్వతీపురం: పెన్ పవర్,** తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి తాను రాజీనామా చేసినట్లు వంగల దాలి నాయుడు తెలిపారు. గురువారం పార్వతీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలన దక్షత నచ్చి ఎన్నికలకు ముందు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, పార్టీ నాయకులు బార్నాల సీతారాం తదితరుల ఆహ్వానం మేరకు పార్వతీపురానికి మంచి చేయాలని తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, చెరువులు, వరహాల గెడ్డ, ప్రభుత్వ స్థలాల కబ్జాలు తొలగించడం తదితర షరతులతో టిడిపిలో చేరటం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎన్నికల్లో పొలిటికల్ కోఆర్డినేటర్/ మేనేజర్ గా నియమించారన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ కార్యాలయంలో వార్ రూమ్ లో పనిచేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్క్ షాప్ తో పాటు లోకేష్, దేవినేని ఉమ తదితర పెద్దల జూమ్ మీటింగ్ కార్యక్రమాల్లో పాల్గొని పనిచేయడం జరిగిందన్నారు. అనంతరం పార్టీ అధికారంలోకి వచ్చాక, ఎమ్మెల్యే విజయ్ చంద్ర తో పాటు కొంతమంది అనుచరులు తన పట్ల ఇబ్బందులకు గురి చేసే విధంగా ప్రవర్తించారు అన్నారు. కనీసం ఓట్లేయుంచిన పట్టణ పెద్దలకు తిరుపతి లెటర్ కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. తన భార్య బదిలీ విషయంలో ప్రభుత్వ గైడ్లెన్స్ కు విరుద్ధంగా అధికారులపై ఒత్తిడి తెచ్చి తనకు అన్యాయం చేశారన్నారు. అలాగే తనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ పోలీసులపై ఒత్తిడి తెచ్చారన్నారు. అలాగే తనకు ఇచ్చిన మాటలు పెడచెవిన పెట్టారన్నారు. చెరువుల్లో కబ్జాలు తొలగింపు చర్యలు లేవన్నారు. తాగునీటి పరిస్థితి పై దృష్టి సారించలేదన్నారు. రోడ్లు గోతులు పూడ్చే పరిస్థితి లేదన్నారు. చెత్త డంపింగ్ యార్డ్ తరలించే ఆలోచన చేయటం లేదన్నారు. అధికారానికి ముందు ఒక మాట... అధికారం వచ్చాక మరో మాట అన్న విధంగా స్థానిక నాయకత్వం ఉండటంతో, పార్టీలో ఉంటే తమ వ్యక్తిత్వాన్ని కోల్పోయే అవకాశం ఉందన్నారు. అందుకే తాను పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా లెటర్ ను రాష్ట్ర అధ్యక్షులకు పంపించినట్లు తెలిపారు. ఇన్నాళ్లు తనను ఆదరించిన పార్టీకి పార్టీ నాయకులు కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్స్ వితరణ....



**కురుపాం, పెన్ పవర్, జనవరి -9:** సెట్విజ్ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో కురుపాం బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠ శాలలో చదువుతున్న విద్యా ర్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ మరియు డ్రగ్స్, మాదక ద్రవ్యాలు నివారణపై అవగాహన సదస్సు నిర్వహిం చారు, కార్యక్రమానికి పాటశాల ప్రిన్సిపల్ పి.సత్యన్నారాయణ అధ్యక్షత వహించారు, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆశీరయ్య , లక్ష్మి , యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ హాజరయ్యారు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు దుర్వ్యాసనాలకు దూరంగా ఉండాలని , మొబైల్ ఫోన్స్ ద్వారా కేవలం విద్య విజ్ఞానం మాత్రమే ఉపయోగించాలని అనవసరమైన ఆన్లైన్ గేమ్స్ కు దూరంగా ఉండాలని సూచించారు విద్యార్థుల కు వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత , ఏకాగ్రత వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయనీ తద్వారా ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని అన్నారు, కమ్యూనికేషన్ స్కిల్స్ చాల ముఖ్యం అని సూచించారు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఒత్తిడి కి దూరంగా ఉండి పరీక్షలకు సన్నద్ధం కావాలి అని కోరారు . ఈ కార్యక్రమానికి పాటశాల ఉపాధ్యాయులు ఫాతిమా ,వార్డెన్ మరియు సిబ్బంది హాజరయ్యారు అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ మరియు పెన్నులు పంపిణీ చేశారు.

# కురుపాం ఎమ్మెల్యే గారిని మర్యాదపూర్వకంగా కలిసిన పేసా ఉపాధ్యక్షులు, కార్యదర్శి



**గుమ్మలక్ష్మీపురం జనవరి 09 పెన్ పవర్.** గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎల్విన్ పేట-1 పంచాయతీ కి సంబంధించి పేసా ఎన్నికల్లో గెలుపొందిన ఉపాధ్యక్షులుగా ఆరిక దేవుళ్ళు, కార్యదర్శిగా మండంగి మిన్నారావు గారు ప్రభుత్వ విప్ , కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఎమ్మెల్యే ఉపాధ్యక్షులు, కార్యదర్శి కి సాలువతో సత్కరించడం జరిగింది. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాడి సుదర్శన్రావు, మన్మధ, రామారావు తదితరులు పాల్గొన్నారు.
జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

# జిల్లా పరిషత్ సీ.ఈవో.పి. నారాయణమూర్తి

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, జనవరి 09.** :జిల్లా ప్రజా పరిషత్ ఛైర్పర్సన్ అధ్యక్షతన జనవ రి 18వ తేదీ ఉదయం 9.00 నుంచి 10.30 గంటల వరకు జడ్పీ స్థాయీ సంఘ సమావేశా లు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో పి. నారాయణమూర్తి గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. జడ్పీ ఛైర్పర్సన్ జె. సుభద్ర అధ్య క్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని వి. సి హాలు లో, జడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం నుంచి నిర్దేశిత సమయాల్లో జరుగుతాయని, సంబంధిత ఏర్పాట్లు చేస్తున్నా మని పేర్కొన్నారు. ప్రాదేశిక నియోజకవర్గ స భ్యులు, ఎంపీపీలు, అధికారులు సమావేశా లకు హాజరుకావాలని ప్రకటన ద్వారా కోరారు.

# హెచ్ఎంపీవీ పై అలెర్ట్





- విమ్స్ ఆస్పత్రిలో 20 పడకల వార్డు ఏర్పాటు
- మందులు, ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధం చేసిన అధికారులు
- వైరస్ పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్న వైద్యులు
- రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె రాంబాబు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జనవరి 9:** విశాఖపట్నం: హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు దేశంలో నమోదు కావడంతో కోవిడ్ లో వేలాది మందికి వైద్యం అందించిన విమ్స్ ఆస్పత్రి అలెర్ట్ అయ్యింది. వ్యాధి గ్రస్తులకు చికిత్స అందించడం కోసం ముందుస్తు చర్యగా విమ్స్ ఆస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు ఆదేశాల మేరకు సిద్ధం చేశారు. ఆస్పత్రిలో కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన హై ఫ్లోన్యాసల్ కాన్యులా (నిమిషంలో 60 లీటర్ల ఆక్సిజన్ అందించే) వాటిని కూడా సిద్ధం చేశారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. ప్రజలు ఈ వైరస్ పై వస్తున్న వదంతులు నమ్మవద్దని, ఇది ప్రాణాంతకం కాదని, సాధారణ ఫ్లూ వైరస్ లక్షణాలే కనిపిస్తాయని తెలియజేసింది.

వైరస్ లక్షణాలు

జ్వరం, గొంతునొప్పి, ముక్కు దిబ్బడ, ఆయాసం వంటివి వైరస్ లక్షణాలు వైరస్ సోకిన వారికి రిబావిరిన్ అజిత్రో మైసిన్ లాంటి మందులతో చికిత్స అందిస్తారు పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉంది. హైరిస్క్ గ్రూపులకు చెందిన హెచ్ఐవీ, క్షయ, డయాలసిస్ రోగులు, సీఓపీడీ, ఆస్తమా రోగులు హెచ్ఎంపీవీ వైరస్ బారిన పడే అవకాశం ఉంది.


**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

చేతులు పరిశుభ్రత పాటించాలి.
మాస్క్ లు ధరించాలి.
బహిరంగ ప్రదేశాల్లో తుమ్మడం, దగ్గడం చేయ కూడదు.వైరస్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
సాధారణ జలుబు లాగే
హెచ్ఎంపీవీ కామన్ కోల్డ్ లాంటిది.భయపడాల్సిన అవసరం లేదు. ముందుస్తు చర్యల్లో భాగంగా విమ్స్ ఆస్పత్రిలో 20 పడకల వార్డును, మందులను సిద్ధం చేశాం కోవిడ్కు తీసుకున్నట్టు గానే ఈవైరస్ నివారణకు కూడా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది,పిల్లలు,వృద్ధులు, హైరిస్క్ గ్రూపు వారు అప్రమత్తంగా ఉండాలి అని విన్స్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు తెలియజేశారు.

# విమ్స్ లో రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి :విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె రాంబాబు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జనవరి 9** :విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నందు గురువారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.. ఈ శిబిరాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరానికి రక్తం లభ్యం కాక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని.. రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని కోరారు.. రక్తదానం చేయటం వలన కొత్త రక్తం ఉత్పన్నమయి శరీరంలో ఉత్తేజం కలుగుతుందన్నారు.. ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయటం వలన ఆపదలో ఉన్నవారు ప్రాణాలు కాపాడటంతో పాటు మనం కూడా ఆరోగ్యకరంగా ఉండవచ్చని తెలిపారు.. రక్తదానం చేయటానికి విమ్స్ ఉద్యోగులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విమ్స్ కార్యాలయం పర్యవేక్షణ అధికారి సత్యనారాయణ రక్తదానం చేసి సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు.. ఈ కార్యక్రమంలో విమ్స్ పరిపాలన అధికారి షేక్ బాజిత్ తదితరులు పాల్గొన్నారు..

# బకులూరు - రాజవొమ్మంగి లింక్ రోడ్ ఇదే



బకులూరు- రాజవొమ్మంగి లింక్ రోడ్డు నిర్మాణానికై ప్రజల ఎదురుచూపు

**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 9:** కేవలం మూడు కిలోమీటర్లు రోడ్ నిర్మించకపోవడంతో సుమారు 30 కిలోమీటర్ల పైగా ఆధారంగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఇది. మండలంలోని బకులూరు నుండి పక్క మండలమైన రాజవొమ్మంగి మండల కేంద్రానికి కేవలం 12 కిలోమీటర్లు దూరం మాత్రమే. ఈ 12 కిలోమీటర్లలో బాకులూరు దాటిన తర్వాత కేవలం మూడు కిలోమీటర్లు మాత్రమే రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఈ మూడు కిలోమీటర్లు రోడ్డు నిర్మిస్తే దాదాపు ప్రయాణికులకు రోడ్డు సౌకర్యం కలిగినట్టే. దీనివలన బకులూరు పరిసర గ్రామాల ప్రజలు రాజువొమ్మంగికి సునాయాసంగా చేరుకోవచ్చు. ఈ రోడ్డు లేక సుమారు 30 కిలోమీటర్ల పైగా అదనంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. బకులూరు - రాజవొమ్మంగి లింక్ మెటల్ రోడ్డు నిర్మించాలని ఈ ప్రాంత వాసులు చాలా ఏళ్లుగా కోరుతున్నప్పటికీ ఆ దిశగా చర్యలు సాగలేదు. కొయ్యూరు, రాజవొమ్మంగి మండల స్థాయి ప్రజా ప్రతినిధులతో పాటు స్థానిక సర్పంచులు చొరవ తీసుకుంటే ఈ లింకు రోడ్డు నిర్మాణం కార్యరూపం దాల్చుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కర్లపాదొర్ లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

- జిల్లా పరిషత్ నిధులు 5 లక్షలతో 110 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం.
- లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, ఎంపీటీసీ వి సాదురం, వైసిపి నేత ఎ జగబంధు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 09.** మండలంలో గల లక్ష్మీపురం పంచాయితీ, కర్లపాదొర్ గ్రామంలో ఐదు లక్షల జిల్లా పరిషత్ నిధులతో 110 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ కొర్రా.త్రినాథ్, ఎంపీటీసీ వి.సాదురామ్, వైసిపి జిల్లా కార్యదర్శి జగబంధు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ... లక్ష్మీపురం పంచాయితీ పరిధిలో గల గ్రామాలలో సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గత రెండు సంవత్సరాల క్రితం ఉమ్మడి జిల్లా చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రకు వినత పత్రం సమర్పించమని, దానికి స్పందించిన ఆమె పంచాయతీ పరిధిలో గల బిరిగూడ, ఆర్లాయిపుట్, ఉబ్బెంగుల గ్రామాలతో పాటు కర్లపాదొర్ లో కూడ సిసి రోడ్లు మంజూరు చేసారన్నారు. జిల్లా పరిషత్ నిధులు 5 లక్షలతో 110 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం సంతోషకరమైన విషయం అన్నారు. గ్రామాలలో వర్ష కాలంలో తిరగడం చాలా కష్టంగా ఉండేదని, ఇప్పుడు ఆ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. గ్రామస్తుల తరపున జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కు కృతజ్ఞతలు తెలిపారు. తదనంతరం వైసిపి అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు మాట్లాడుతూ.. భవిష్యత్తులో జిల్లా పరిషత్ నిధులతో మరిని అభివృధి పనులు చేయుటకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని, అవి కూడ త్వరలోనే ప్రారంభిస్తామని, గిరిజన ప్రాంత అభివృద్దే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత బుద్ధ, గ్రామస్తులు వి నీలకంఠం, కె గోపాల్, వి సుఖదేవ్, వి రాజు, గుత్తేదారుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రూ. 20.85 లక్షల 417కిలోల గంజాయి పట్టివేత

ఒక వ్యక్తి అరెస్ట్ - బొలెరో వాహనం స్వాధీనం



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 9:** గురువారం మండలంలోని కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధి చీడిపాలెంజంక్షన్ వద్ద రూ. 20.85 లక్షల విలువ గల 417 కిలోల గంజాయి పోలీసులకు పట్టుబడింది. కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ అందించిన వివరాల ప్రకారం-ఒడిస్సా నుండి గంజాయి తీసుకువస్తున ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, 417 కిలోల గంజాయిని, అతని నుండి ఒక బొలెరో వాహనం స్వాధీనం చేసుకోవడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ మాట్లాడుతూ - గంజాయి సాగు, క్రయవిక్రయాలకు దూరంగా ఉండాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది, చీడిపాలెం సచివాలయ సిబ్బంది జాన్, గురుమూర్తి పాల్గొన్నారు.

# గిరిజనులకు ఆదాయ మార్గాలపై అవగాహన సదస్సు.

ఆగ్రో పుడ్స్ సిఇఓ గంధం లక్ష్మీ సునీత.




**కొయ్యూరు,పెన్ పవర్ జనవరి 9:** గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు విరివిగా పండించే జీడి పిక్క ప్రోసేసింగ్ వంటి యునిట్ నెలకొల్పడం ఎంతో ప్రయోజనం ఉందని తద్వారా ఆదాయం పొందవచ్చని రేవతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరక్టర్ సిహెచ్ వి ఎస్ ఆర్ ప్రసాద్ మరియు గంధం అర్గో పూడ్స్ సిఇఓ లక్ష్మీ సునీత లు అన్నారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం అంతాడ లో గురువారం స్థానిక సర్పంచ్ సుర్ల చంద్రరావు అధ్యక్షతన గంధం ఆగ్రో ఫుడ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ప్రాంత మహిళలు, పురుషులకు ఈ జీడి పిక్కలు ద్వారా తయారు చేసే యూనిట్ ను ఏవిధంగా పొందాలి, ఆదాయ అవకాశాలు పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ మండలంలో ప్రోసేసింగ్ యూనిట్ నెలకొల్పటం పై తగిన స్థలాన్ని సమకూర్చితే తగిన ప్రోత్సాహం కల్పిస్తామని వారు తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వరరాజు మరియు ప్రభుత్వ అధికార్లు సలహాలు, సూచనలతో మా వంతు సహకారం అందిస్తామని గంధం ఆగ్రో పుడ్స్ సిఇ ఓ గంధం లక్ష్మీ సునీత మరియు రేవతి చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ డైరక్టర్ వి ఆర్ ఎస్ ప్రసాద్ గౌరవ అధ్యక్షులు అప్పారావు లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రరావు,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రిముల చంద్రరావు, సామాజిక సేవకుడు అర్జున్ రెడ్డి, జిల్లా గిరిజన మోర్చ అధ్యక్షులు అరిమెలా రాజు, ఎంపీటీసీ దేముడు, సన్యాసిరావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

# అమర్ నీ పంథా మార్చుకోకపోతే రాజకీయంగా



## కనుమరుగు అయిపోతావు గండి బాబ్జి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 09 :** తిరుమలలో తొక్కిసలాట ఘటన దురదృష్ట కరం అని రాష్ట్ర కో-ఆపరేటివ్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షు లు గండి బాబ్జి అన్నారు గురువారం జిల్లా తెలు గుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరు ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైజాగ్ నుంచి తిరుపతి లో జరిగిన ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము అని చెప్పారు. క్షతగాత్రుల కు పూర్తి స్థాయి చికిత్స అందించి వారి ఇళ్లకు పంపిస్తాము. మృతి చెందినవారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుం దని తెలిపారు. నిన్న మోదీ పర్యటన లోసుమా రు 2 లక్షల కోట్ల పెట్టుబడులకు శంకుస్థాపన చేశారు. ఈ పెట్టుబడులు మూడు నుంచి నాలు గు లక్షల ఉద్యోగాలు వస్తాయి అని అన్నారు. నిన్న శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులకు గతం లోనే శంకుస్థాపన చేసామని వైసీపీ నాయకులు చెబుతున్నారు. గతంలో శంకుస్థాపన చేసిన ప్రా జెక్టులకు ప్రధాని మోదీ వచ్చి ఎలా శంకుస్థాపన చేస్తారు . వైసీపీ నాయకులకు పరిపాలన చేతకాదు. కేవలం దోపిడీ పైనే గత వైసీపీ ప్రభుత్వం దృ ష్టి పెట్టింది. గతంలో మంత్రిగా ఉన్న సమయం లో అమర్నాథ్ ఎం సాధించావో చెప్పాలి అని డిమాండ్ చేశారు అమర్నాథ్ నెలకి ఒక దేశం వెళ్తున్నారు. ప్రమాదాలు జరిగితే కమీషన్లు వ సూలు చేసుకొనే అమర్నాథ్ ఇప్పుడు చంద్ర బాబు కోసం మాట్లాడుతున్నారు సీ.ఎం. చంద్ర బాబు, పవన్ కళ్యాణ్ లను విమర్శించే స్థాయి అమర్నాథ్ కు లేదు. మైక్ దొరికింది కాదా అని అమర్నాథ్ మాట్లాడితే సరికాదు. కోడిగుడ్డు మంత్రిగా పేరుపొందిన అమర్ గత ఎన్నికలలో నే నీకు చుక్కలు చూపించారు ఇంకా నీ పంథా మార్చుకోకపోతే రాజకీయంగా కనుమరుగు అయిపోతావు అని పేర్కొన్నారు. వై.సీ.పీ ప్రభు త్వం గత ఐదు సంవత్సరాలలో రైల్వే జోన్ కు కనీసం భూములు కూడా కేటాయించలేదు. స మావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గొంపా సత్య నారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమర శెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికై ఉపాధ్యాయుని విరాళం



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 9:** గ్రామంలోని పాఠశాలలో అభివృద్ధి పనులు చేయడానికి ఓ ఉపాధ్యాయుడు తనవంతుగా విరాళం అందజేసిన అరుదైన విషయం ఇది. వివరాలిలాఉన్నాయి. మండలంలోని పాతబాలారం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల అభివృద్ధి కొరకు ఆ పాఠశాలలో పనిచేస్తున్న వేంపాటి తలుపులు రూ. 5వేలు విరాళముగా అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుడుముల వరహాలు, పాఠశాల విద్యా కమిటీ చైర్ పర్సన్ గాదిరాజు నాగ వెంకట సత్యవతి, వైస్ చైర్మన్ గాదిరాజు రమణ, పాఠశాల మాజీ చైర్మన్ గాదిరాజు భువనేశ్వరి, విద్యాకమిటీ సభ్యులు పాల్గొని, పాఠశాల అభివృద్ధి పట్ల ఉపాధ్యాయుడు, మండల పిఆర్టియు నేత వేంపాటి తలుపులు యొక్క ప్రత్యేక శ్రద్ధను, ఉదారతాభావాన్ని కొనియాడారు.

# అంతర్జాతీయ కాఫీ రేట్లు గిరిజనులు పండించిన కాఫీకి అమలు చేయాలి

• పేసా కమిటీ సభ్యుల డిమాండ్



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జనవరి 9:** అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న కాఫీ రేట్లను గిరిజన రైతులు పండిస్తున్న కాఫీ కి అమలు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో గల పేసా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం జీకే వీధి పంచాయతీ పేసా ఉపాధ్యక్షులు జి నాగేశ్వరరావు, లకే రామచంద్రుడు, పరమేశ్వర రావు. కార్యదర్శులు ముక్కల గిరి, కొర్ర భూపతి, కే. బాబీ, వి. జగత్ రావు ఆధ్వర్యంలో ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన రైతులు పండించిన కాఫీ కి అంతర్జాతీయ కాఫీ రేటును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ కాఫీ బోర్డ్ కేజీ కాఫీ పార్చ్ మెంట్ కిలో ధర 452 రూపాయలు, చెర్రీ 260 రూపాయలు ప్రకటించారు. కానీ వివిధ సంస్థలైన ఐటీడీఏ మెక్స్ సంస్థ ద్వారా కేజీ పండ్ల ధర 44 రూపాయలు కొనుగోలు చేస్తుంది. దళారులు 50 నుండి 55 రూపాయల వరకు కొనుగోలు చేస్తున్నారు. జిసిసి సంస్థ పార్చి మెంట్ కిలో 320 రూపాయలు, చెర్రీ 170 రూపాయలకు కొనుగోలు చేస్తుందని, దీనివలన గిరిజన కాఫీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేసా కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు, సంస్థలు, వ్యక్తిగత స్వలాభం కోసం వారికి నచ్చిన రేట్లను ప్రకటించి రైతులను మోసం చేస్తున్నారని, అలాగే గిరిజన ప్రాంతంలో చాలా కాలం నుండి దళారులు ముందస్తు పెట్టుబడులు పెట్టి రైతుల నుండి దోచుకోవటం జరుగుతుందని తెలిపారు. కావున ప్రభుత్వం స్పందించి అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న కాఫీ రేటును గిరిజన ప్రాంత రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జర్రెల ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు





తెలుగుదనం ఉట్టిపడేలా చిన్నారులు నిర్వహించిన పండగ

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జనవరి 9:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జర్రెలలో ట్రైబల్ వెల్పర్ బాలురు ఆశ్రమ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు తెలుగుతనం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయులు కుమ్మరి సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పండుగ శోభను తీసుకువచ్చింది. భోగి మంటలు, గొబ్బెమ్మలు, రామదాసులు, కొమ్మ దాసరి వంటివి విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు చక్కని పంచకట్టుతో తెలుగుతనం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కుమ్మరి సింహాచలం. ఉపాధ్యాయులు గాసాడి పద్మనాభం, బూడిద కృష్ణారావు, అమరేశ్వర రావు, చిన్నబ్బాయి, ఎంసిఎస్ఎస్వి ప్రసాదరావు, శేఖర్, రమేష్, సన్యాసిరావు, విజయ కుమార్, ఇతర సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







# డాలి ప్లే స్కూల్లో సంక్రాంతి సంబరాలు





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం జనవరి 09. :** జీ.వీ.ఎం.సీ 87 వార్డు పరిధిలో గల కణితి కాల నీ కళింగ వీధిలో డాలి ప్లే స్కూల్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు వేడుకలు గు రువారం ఘనంగా నిర్వహించారు ప్రిన్సిపల్ మాధురి వైస్ ప్రిన్సిపల్ శిరీష, సుధా, బేబీ ఆధ్వ ర్యంలో చిన్న పిల్లల చేత శ్రీ వెంకటేశ్వర స్వామి హరిదాసు తదితర వేషధారణలో అలరించారు తర్వాత వివిధ వస్త్రాల ధరించి మరియు వివిధ వ్యాసాధారంలోచిన్న పిల్లలు తో వివిధ వేషాధా రణల తో సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పేరెం ట్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర కాశ్మీర్ లంబసింగి లో గిరిజన సంక్షేమ హాస్టల్ లో సంక్రాంతి సంబరాలు

• ప్రత్యేక ఆకర్షణీయంగా వేషధారణలు మరియు వస్త్ర అలంకరణలు





**చింతపల్లి పెన్ పవర్ జనవరి 9:-** ఆంధ్ర కశ్మీర్ లంబసింగి పర్యాటక ప్రాంతంగా పేరొందిన గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.ఎస్.ఎన్ రాజు, వసతిగృహ అధికారిని ఎన్ కవిత నాయుడు ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంక్రాంతి సంబరాలలో రంగవల్లులతో పాటు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సంబరాలలో భోగి మంటలు వేశారు. చిన్నారులు వేసిన హరిదాసు తదితర వేషధారణలు ఆహుతులను విశేషంగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయునీలతో పాటు, విద్యార్థినిలు ప్రత్యేక వస్త్రాలంకరణలతో రంగవల్లుల పోటీలలోనూ, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలలోనూ భాగస్వాములు అయ్యారు.

# పీసా చట్టం పటిష్ఠముగా అమలు చేయండి

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్.



**పాడేరు, పెన్ పవర్ జనవరి 9.** పాడేరు పంచాయతీ పరిధిలో గుడివాడ, సుంద్రుపుట్టు, గ్రామసభ సభ్యులు ప్రాజెక్ట్ అధికారి కలిశారు అనంతరం ప్రాజెక్ట్ అధికారి కమిటీ సభ్యులు మాట్లాడుతూ, చట్టం పరిధిలో ఉన్న ప్రతి సమస్య పరిసలించి గ్రామ సభ ద్వారా గ్రామ అభివృద్ధికి, లబ్ధిదర్ల ఎంపిక చేయుటకు గ్రామ సభ తీర్మానం చేసి గ్రామ అభివృద్ధికి సహాకారిస్తూ, ప్రతి విషయానికి గ్రామ సభ తీర్మానం చేయాలనీ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ని కమిటీ సభ్యులు కు కోరడమైనది ఈ కార్యక్రమం లో ఉపాధక్షులు శ్రీ సల్ల రామకృష్ణ, బోనంగి వెంకట రమన్న ధనటి పాలసీ రాంబాబు, కార్యద్దర్సులు కిల్లో రాధాకృష్ణ నాయుడు, కొట్టగులి సింహాచలం నాయుడు పెద్ద, జవాది లింగమూర్తి పాల్గున్నారు

# దుచ్చరపాలెం గ్రామంలో చింతపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థుల పిఆర్ఏ కార్యక్రమం







**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జనవరి 9:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ దుచ్చరపాలెం గ్రామంలో చింతపల్లి సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు"గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ"( పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ పిఆర్ఏ) కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ పాఠ్యాంశాల్లో భాగంగా గ్రామస్తుల సహకారంతో వ్యవసాయానికి సంబంధించి ఆ గ్రామం యొక్క పూర్తి సమాచారాన్ని అనగా నేలల పరిస్థితి, సేద్యానికి నీటి లభ్యత, వివిధ పంటల సాగు వివరాలు, సీజన్ల వారీగా పంటల ప్రణాళిక పంటల సాగులో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలు, యాంత్రికరణ పరిస్థితి, పంట కోత, అనంతరం నిలువ మరియు మార్కెటింగ్ మొదలగు అంశాలను విశ్లేషించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి బాల హుస్సేన్ రెడ్డి తెలిపారు. దుచ్చరపాలెం గ్రామంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు సంగీత సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ అధ్యాపక సిబ్బంది కుమారి శ్వేత, కుమారి హిమ సైనా, పాలిటెక్నిక్ విద్యార్థినీ విద్యార్థులు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి గ్రామం లో చెత్తబుట్టల ఏర్పాటు.

- సర్పంచ్ దూరియ పుష్పలత
- ఎంపీడీవో శ్రీనివాసరావు




**చింతపల్లి పెన్ పవర్ జనవరి 9 :-** చింతపల్లి మండల కేంద్రంలో పారిశుధ్యనికి చెత్తబుట్టలను ఏర్పాటు చేయడం జరిగింది. గురువారం స్థానిక సర్పంచ్ పుష్పలత ఆధ్వర్యంలో ఎంపీడీవో యుఎస్వి శ్రీనివాసరావు చెత్త బుట్టలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన కోడళ్ళలో, రహదారులు, వీధులలో చెత్త ఎక్కువగా పేరు పోతుండడంతో చెత్తబుట్టలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ చెత్త బుట్టలు చెత్త వేస్తే పారిశుధ్య కార్మికులు వచ్చి దానిని తీసివేస్తారన్నారు. హనుమాన్ జంక్షన్ నుండి మార్కెట్ వరకు 8 చెత్త బుట్టలు, వీధుల్లో 12 చెత్తబుట్టలు మొత్తం మండల కేంద్రంలో 20 చెత్త బుట్టలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చెత్త బుట్టలను మండల కేంద్ర ప్రజలు వినియోగించుకోవానీ, పారిశుధ్యనీకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పరువేయకుండా చెత్తబుట్టలో మాత్రమే వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, తోడు సేవ స్వచ్ఛంద సంస్థ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌కు నో చెప్పండి: దువ్వాడ సెక్టార్ 1లో అవగాహన కార్యక్రమం







**గాజువాక పెన్ పవర్, జనవరి 09 :**దువ్వాడ సెక్టార్ 1లో ప్లాస్టిక్ బ్యాన్‌పై అవగాహన పెంచేందుకు వార్డు కార్పొరేటర్ మొలి ముత్యాలు, వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్, కూటమి నుంచి పలువురు స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో షాప్‌కీపర్లకు అవగాహన కల్పిస్తూ స్టిక్కర్లను అతికించారు. ఒక్కసారిగా వాడి పారేసే ప్లాస్టిక్ వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించారు.
పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం స్థానికంగా మంచి స్పందనను పొందింది.
పర్యావరణ పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని కార్పొరేటర్ ముత్యాలు తెలిపారు.

## కాలం చెల్లిన పెరుగు అమ్మకం పై ఎమ్మార్వో కు ఫిర్యాదు

- విక్రయదారుని పై కఠిన చర్యలు తీసుకోవాలి.
- అల్లూరి జిల్లా విజిలెన్స్ మెంబర్ సోనియా ప్రసన్న కుమార్, బాధిత చిన్నారి తండ్రి సుబ్రమణ్యం.
- కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం -తహసిల్దార్ నర్సమ్మ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 09.**మండల కేంద్రంలో కాలం చెల్లిన పెరుగు ప్యాకెట్లు విక్రయించిన సదరు వ్యాపారి పై చర్యలు తీసుకోవాలని మండల తహసిల్దార్ నర్సమ్మకు అల్లూరి జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ సోనియా ప్రసన్నకుమార్, చిన్నారి తండ్రి తో కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. వివిధ పత్రికల్లో కాలం చెల్లిన పెరుగు ప్యాకెట్లు కొనుగోలు చేసి అ పెరుగు తినడంతో అస్వస్థకు గురై ఏడేళ్ల చిన్నారి ఆసుపత్రికి పాలైందని ఆయన అన్నారు. ఇలాంటి సంఘటనలు మరల మండల కేంద్రంలో పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలని తహసిల్దార్ నర్సమ్మ కు కోరారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుల నుండి వినతి పత్రం స్వీకరించిన తర్వాత ఈ విషయంపై సదరు వ్యాపారి కి తహసిల్దార్ తమ కార్యాలయం కు పిలిపించి, మందలించి ఇకపై నుండి కాలం చెల్లిన నిత్యవసర సరుకులు ఎలాంటివి అమ్మరాదని అమ్మినట్టు మరలా ఫిర్యాదులు వస్తే సదరు వ్యాపారస్తులపై కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ నర్సమ్మ అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో మండల వినియోగదారుల సంఘ సభ్యులు, గాసిరం దొర, కాంతరి మోహన్, నాగభూషణ్, పూర్ణరావు లతోపాటు బాధితుడు మోసియా సుబ్రహ్మణ్యం ఉన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలు విజయవంతం చేయండి.







**జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్.**

**పాడేరు,పెన్ పవర్ జనవరి 9.**అల్లూరి జిల్లా పాడేరు గణతంత్ర దినోత్సవ వేడుకలు విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26.న స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గణతంత్ర దినోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలపై శకటాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అదేవిధంగా ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల వారసులను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించాలని సూచించారు.గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముందు తరువాత మైదాన్ని పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు.అంతరాయం లేని విద్యుత్తు సరఫరా చేయాలని ట్రాన్స్కో అధికారులకు సూచించారు.ఈ సమావేశం లో జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, ఐటిడిఏ పి.ఓ.వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్,
డి.ఆర్.ఓ.కె.పద్మలత, డి.ఆర్.డి.ఏ.పి.డి. వి.మురళి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్,జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, పశు సంవర్ధక శాఖ డి.డి. నరసింహులు, జిల్లా సెరీ కల్చర్ అధికారి అప్పారావు, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇ జి. డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

**ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, 87 వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం**





**గాజువాక పెన్ పవర్, జనవరి 09:** గాజువాక నియోజకవర్గం 87వ వార్డు పరిధిలో వడ్లపూడి బస్టాప్ నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ప్లాస్టిక్ వొద్దు,నారా సంచే వాడుదాం అనే నినాదంతో అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ వాడటం చట్టరీత్యా నేరమని వాడినవారికి జరిమాణం విదిస్తారని, ప్లాస్టిక్ వాడటం వల్ల పర్యావరణానికి హాని కలిగిస్తుందని, ప్లాస్టిక్ భూములో కలగక సాంద్రతను తగ్గిస్తుందని ,దానివల్ల పర్యావరణానికి మరియు జన జీవనానికి హాని కలిగిస్తుంది అని అన్నారు.వార్డులో ఉన్న వర్తక సంఘాలకు ప్లాస్టిక్ సంచులు బదులు నారసంచులు వాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు, జిల్లా కార్యదర్శి కళ్లేపల్లి శ్రీనివాసవర్మ,సీనియర్ నాయకులు శిరసపల్లి బాబురావు, కడుపుట్ల శ్రీను, శానటరి ఇన్స్పెక్టర్ అప్పారావు, సచివాలయం సిబ్బంది శానిటేషన్ సెక్రటరీస్ : రమణ, వరలక్ష్మి, లలిత, నీలిమ, భారతుడు, సంధ్య, మహిళా పోలీస్: దివ్య, లేఖ్య, వాసంతి, ప్లానింగ్: భారతి, రమాదేవి, జగన్నాథ సానిటరీ సిబ్బంది, ఆర్పీలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# పోలీసు కానిస్టేబులు ఉద్యోగాల నియామక ప్రక్రియ






**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**

**విజయనగరం క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, జనవరి 09. :**
స్టైఫెండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియా మకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధిం చిన అభ్యర్థులకు పి.ఎం.టి. మరియు పి.ఈ.టి. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జనవరి 9న తెలిపారు.జనవరి 9న నిర్వహించిన 8వ రోజు పి.ఎం.టి. మరియ పి.ఈ.టి. పరీక్షలకు 600 మంది పురుష అభ్య ర్థులు హాజరుకావాల్సి ఉండగా, 375 అభ్యర్థు లు మాత్రమే పి.ఎం.టి.పి.ఈ.టి. పరీక్షలకు హాజ రయ్యారన్నారు. నియామకాల ప్రక్రియ వేకువ జామున 5గంటల నుండే ప్రారంభం కావ డం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో, పి.ఎం. టి. మరియు పి.ఈ.టి. పరీక్షలు సకాలంలో పూ ర్తయ్యాయన్నారు. పోలీసు నియామకాల ప్రక్రి యను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, అదనపు . ఎస్పీ..సౌమ్యలత, ఎ.ఆర్ అదనపు ఎస్పీ జి.నా గేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. అభ్య ర్థులకు ముందుగా హాల్ టికెట్స్ పరిశీలిం చి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేష న్లు, వయస్సు నిర్ధారించే ధృవపత్రాలను పరిశీ లించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్య ర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అనుమతించామన్నారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఇక్విప్ మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను నిర్ధారించి, అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఈ.టి. పరీక్షలను అనుమతిం చామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌ మ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి. నాగేశ్వర రావు, డిఎస్పీలు ఎం.వీరకుమార్, యూనివర్స్, ఎస్.బాపూజీ, టి.ఎన్.శ్రీనివాసరావు, కే.థామస్ రెడ్డి, ఎఓ పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, రిజర్వు ఇన్స్పెక్టర్స్, ఎస్సైలు, ఆర్.ఎస్.ఐ.లు పిఈటీలు మరియు ఇతర పోలీసు అధికారు లు, పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొని, ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించారు.






# రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం

**ముగ్గురు బాధితులకు రు.1,50,000/-లు పరిహారం అందజేత**




**విశాఖ క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, జనవరి 09 :** విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా బాధితులకు పరిహారం అందేవరకు కావలిసిన సహాయం అందజేయడం జరుగుతు న్నది. ఈ సహాయ కేంద్రం తీసుకున్న చర్యలు ఫలితంగా ఇటీవల హిట్ %౨% రన్ ప్రమాదాల్లో తీవ్ర గాయాల పాలైన (1) వాసుదేవ్ ప్రజాపతి సన్నాఫ్ ప్రజాపతి చంపలాల్, మురళినగర్, విశాఖ పట్నం (2) పోలిశెట్టి వెంకట నాగ మాధ వి లేటు సన్నాఫ్ నారాయణ రావు, నర్సీప ట్నం, అనకాపల్లి జిల్లా (3) కోన శంకర రావు సన్నాఫ్ కోన గోపాల రావు మద్రిపాలెం, విశాఖప ట్నం ఒకోక్కరికి రూ. 50,000/- (అక్షరాల యా భై వేల రూపాయలు) చొప్పున మొత్తం రూ. 1,50,000/- (అక్షరాల ఒక లక్ష యాభై వేల రూ పాయిలు) వారి యొక్క బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయడం జరిగింది.

## నూతనంగా గెలుపొందిన పేసా కమిటీ పార్టీలకు అతీతంగా పనిచేయాలి

- గిరిజన హక్కులు చట్టాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
- జీకే వీధి జనసేన పార్టీ అధ్యక్షులు కొయ్యం బాలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 9:** ఇటీవల జరిగిన పేసా గ్రామ కమిటీ ఎన్నికలలో గెలుపొందిన పేసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని గూడెం కొత్త వీధి మండల జనసేన పార్టీ అధ్యక్షులు కొయ్యం బాలు సూచించారు. ఎన్నికలలో ఎన్నిక కాబడ్డ ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు అభినందనలు తెలియజేస్తున్నామని, వారు గిరిజన హక్కులు చట్టాలపై అవగాహన కలిగి చట్టాల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ గ్రామాల అభివృద్ధికి పేసా కమిటీ క్రియాశీలకంగా పని చేయాలని సూచించారు. కొంతమంది పేసా కమిటీని తక్కువగా చూస్తున్నారని, అటువంటి వారిపై దృష్టి పెట్టి అప్పుడు తీర్మానాలు చేయకుండా, పటిష్టంగా గ్రామాల అభివృద్ధికి పనిచేయాలని, వేసా కమిటీ గొప్పతనాన్ని తెలియజేయాలని సూచించారు.

# సామాజిక మరుగు దొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు.



**జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్.**

**పాడేరు,పెన్ పవర్ జనవరి 9.** అల్లూరి జిల్లా పాడేరు స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి గ్రామీణ నీటి సరఫరా విభాగం,జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారులు ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసమూహం అధికంగా ఉన్న ప్రాంతాలు, వారపు సంతలు, పర్యాటక ప్రాంతాలలో నీటి సదుపాయం ఉన్న గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్లు నిర్మిస్తామని చెప్పారు.మరుగుదొడ్లు లేని పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదించాలని చెప్పారు.పారిశుద్ధ్యపు పనులకు మంజూరు చేసిన వాహనాలను వినియోగంలోకి తీసుకుని రావాలన్నారు. సోలిడ్ వేస్ట్ మేనేజ్మెంటు సక్రమంగా జరగాలన్నారు. పారిశుద్ధ్యపు పనులకు జిల్లాకు మంజూరు చేసిన ట్రాక్టర్ల ఎక్కడ,ఎటువంటి స్థితిలో ఉన్నాయో ఆడిట్ చేసి నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు.కోరిన వారందరికి వ్యక్తిగత ఇంకుడు గుంతలు మంజూరు చేస్తామన్నారు. మురుగు కాలవుల కంటే ఇంకుడు గుంతలు నిర్మించడం మంచిదని అన్నారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మిస్తామని పేర్కొన్నారు.

స్వచ్ఛాంధ్రా కార్పోరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు అర్జున రావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ద్వారా స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ఆధ్వర్యంలో వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తామన్నారు.ఇప్పటికే నిర్మించుకుని నివాసం ఉంటున్న గృహాలకు , ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరు చేసిన గృహాలకు వ్యక్తిగత మరుగుదొడ్ల ను మంజూరు చేస్తామన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12 వేల నిధులు మంజూరు చేస్తామన్నారు. రూ.3 లక్షల వ్యయంతో సామాజకి మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు.ఎంపిడి ఓలు జిల్లా కలెక్టర్ ద్వార ప్రతిపాదనలు పంపిస్తే దేవాలయాలు,ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, నాడు నేడులో కవర్ కాని పాఠశాలలు, కెజిబివి పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో నిర్మించిన గృహాలకు 27834 వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు చేసామన్నారు. జిల్లాలో 22 వేల ఇంకుడు గుంతలు నిర్మాణానికి ప్రతిపాదించామని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మించమని ఆదేశించిందని



చెప్పారు.ఈ సమావేశంలో పాడేరు ఐటిడి ఏ.పి.ఓ వి.అభిషేక్,చింతూరు పి.ఓ అపూర్వ భరత్, రంపచోడవరం పి.ఓ.కె. సింహచలం పంచాయతీ అధికారి బి.లవరాజు, డివిజనల్ పంచాయితీ అధికారి పి.ఎస్.కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు,గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్. రజని,జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జమాల్ భాషా, హౌసింగ్ పిడి బి.బాబు, ఎంపిడి ఓలు తదితరులు పాల్గొన్నారు.





# సింగిల్ ప్లాస్టిక్ వాడకం నిషేధిద్దాం

పర్యావరణాన్ని కాపాడుకుందాం







**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జనవరి 9:** జీవీఎంసీ పరిధి 11 వ వార్డు లో జీవీఎంసీ కమిషనర్ జోనల్ కమిషనర్ ఏంహెచ్ఓ అదే సార్ మేరకు సే నో టు ప్లాస్టిక్ ప్లాస్టిక్. సింగల్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీని 11వ వార్డు సానిటరీ ఇన్స్పెక్టర్ బంగారు రాజు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వార్డులో రహదారి ఇరువైపులా ఉన్నా దుకాణాల వద్దకు వెళ్లి వారికి సింగిల్ ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు అనంతరం స్టిక్కర్లను అంటించి ప్లాస్టిక్ వాడకంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను కఠిన ఆంక్షలు వారికి వివరించారు. బాలాజీ నగర్ ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించి భర్తకు వ్యాపారస్తులకు ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్లు వాడకం ద్వారా సంభవించి అనర్ధాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు సచివాలయ పారిశుధ్య పర్యవేక్షణ కార్యదర్శులు. సచివాలయం మహిళ పోలీసులు. ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు

# తిరుపతిలో తొక్కిసలాట ఘటన బాధాకరం

జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్



**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 9:** తిరుపతి వైకుంఠ ఏకాదశి టికెట్ల కౌంటర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటన బాధాకరమని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల జారీ సమయంలో తొక్కిసలాట జరిగిన పలువురు ప్రాణాలు కోల్పోవడం, మరికొంతమంది గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడం మనస్సును ఎంతో కలిచి వేస్తుందన్నారు. తిరుపతి చరిత్రలో ఎప్పుడూలేని విధంగా ఇలాంటి ఘటన జరగడంతో యావత్తు దేశ వ్యాప్తంగా భక్తులంతా ఆవేదన చెందుతున్నారన్నారు. ఈ హృదయ విదారక ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు తమ కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుందన్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా ఈ ఘటన తెలియగానే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించడంతో పాటు దీనికి కారకులపై చర్యలు తీసుకుంటున్నారని తుమ్మలపల్లి రమేష్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టీటీడీ ఇకపై మరిన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.

# శ్రిష్టి వరల్డ్ స్కూల్ లో అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు






**గాజువాక: పెన్ పవర్, జనవరి 09:** ఉక్కునగరం సెక్టర్ - %శ×% లో గల సృష్టి వరల్డ్ స్కూల్ లో సంక్రాంతి పండుగ సంబరాలను అంబరాన్ని తాకే విధంగా అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. పాఠశాలలో చదువుతున్న బాల బాలికలు అందరినీ పాఠశాల మైదానంలో సమావేశపరిచి సంక్రాంతి పండుగ సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భిన్నత్వంలో ఏకత్వానికి గుర్తుగా మన భారతదేశంలో సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా వివిధ రాష్ట్రాలకు చెందిన నృత్య కళారూపాలను ప్రాథమిక స్థాయి విద్యార్థినీ విద్యార్థుల నుండి హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థుల వరకు అందమైన దుస్తులు ధరించి నృత్య ప్రదర్శనలతో భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించారు

ఈ కార్యక్రమంలో అస్సామీ డ్యాన్స్ ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ ప్రదర్శన విద్యార్థుల యొక్క శక్తి సామర్థ్యాలు మరియు వారి ప్రతిభా పాటవాలకు, అంకితభావానికి నిదర్శనగా నిలిచాయి.

ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్స్ అప్పల నరసింహం, భుజంగరావు రూపొందించిన అందమైన కోలమ్‌లు, రంగోలి, గొబ్బెమ్మలు, భోగిమంట,మరియు అందమైన పండుగ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి

పాఠశాల డైరెక్టర్ సుశీలారాణి మాట్లాడుతూ సృష్టి వరల్డ్ స్కూల్ భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి మరియు ప్రోత్సహించడానికి ముందుంటుందనడానికి ఇటువంటి కార్యక్రమాలే నిదర్శనమన్నారు .ఈ సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు .బాల బాలికలను, ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈ.చంద్రిక, ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపాల్ కిరణ్ దేవగిరి, క్రియేటివ్ హెడ్ రాధా శ్రీనివాస్, కోఆర్డినేటర్లు, మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# కమిషనర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాలు

**కీటక జనిత వ్యాధులపై వైద్యాధికారులకు సబ్ యూనిట్ ఆఫీసర్లకు ఒకరోజు శిక్షణ.**

**పాడేరు,పెన్ పవర్ జనవరి 9.**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్ కు సంబంధించి న 35. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మరియు జిల్లా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లలు పాల్గొనడం జరిగింది ఎన్వీబీసీపీ ప్రోగ్రాం కు సంబంధించిన మలేరియా డెంగ్యూ చికెన్ గునియా మొదలకు వ్యాధులపై తీసుకునే నియంత్రణ కార్యక్రమాల గూర్చి అవగాహన సదస్సు నిర్వహించడమైనది దీనిపై దిశ నిర్దేశాలు ఇవ్వడం జరిగింది సంబంధించి మలేరియా అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ బి సుబ్రహ్మణ్యేశ్వరీ (%ణజూ%) డైరెక్టర్ ఆఫ్ హెల్త్ విజయవాడ,డాక్టర్ సి



జమాల్ భాష డిఎం అండ్ హెచ్ ఓ అల్లూరి సీతారామరాజు జిల్లా,
డాక్టర్ ఎం.శాంతి ప్రభ జోనల్ మలేరియా ఆఫీసర్ జోన్




1
ఎం.తులసి జిల్లా మలేరియా అధికారి అల్లూరి సీతారామరాజు జిల్లా



కె.వి.ప్రసాదరావు ఏడి జోనల్ అధికారి విశాఖపట్నం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నా...





• ప్రెస్ క్లబ్ సత్కార సభలో ఎమ్మెల్యే నల్లమిల్లి...

**అనపర్తి,పెన్ పవర్,జనవరి 9:** తెల్లారితే కలం, లోగోలు చేత పట్టుకుని సమాజ సమస్యల పట్ల తీసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే క్రమంలో పాటుపడుతున్న పాత్రికేయుల సంక్షేమానికి తాను, కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మహా టీవీ రిపోర్టర్ సత్తి శ్రీనివాస్ రెడ్డి (మహా శీను) సారథ్యంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని పాత్రికేయులు ఉచిత రీతిని సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గడచిన ఆరు నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తన సీటు విషయమై డోలాయమాన పరిస్థితి ఏర్పడినప్పుడు మీడియా అంతా నాకు అండగా ఉండి ముందుకు నడిపిన విషయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటానన్నారు. నైతిక మద్దతు తెలుపుతూ సీట్ విషయంలో తాను పడిన ఇబ్బందులను ప్రతినిత్యం ప్రజల ముందుకు తీసుకువెళ్లడంలో మీడియా సలిపిన కృషికి ఎప్పటికీ రుణపడి ఉంటాను అన్నారు. సీనియర్ రిపోర్టర్ కర్రి సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి విలేకరులకు చట్టబద్ధంగా అందాల్సిన ఇళ్ల స్థలాలు, ప్రెస్ క్లబ్ నిర్మాణం తదితర అంశాలను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సమక్షంలో ప్రస్తావించగా ఆయన స్పందిస్తూ వెబ్ చానల్స్ సోషల్ మీడియా పేరుతో నియోజకవర్గంలోనే భారీ సంఖ్యలో విలేకరులు ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని అందరికీ ఇవ్వడం సాధ్యం కాదని మీరే ఒక కమిటీగా ఏర్పడి ఒక ప్రామాణికతను నిర్దేశించుకుని జాబితాను రూపొందించి నాకందించాలని అధికారులతో మాట్లాడి ఇళ్ల స్థలాలు విషయం సాకారం చేస్తానని హామీ ఇచ్చారు. పాత్రికేయులుగా పనిచేస్తున్న వారికి ఏ అవసరం వచ్చినా తాను ఉపయోగపడతానన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని సీనియర్ పాత్రికేయులు దుర్భ శ్రీ రామ్ మూర్తి, ఈనాడు మాస్టారు, వార్త శ్రీను, సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి, ఆంధ్రజ్యోతి శ్రీనివాసరెడ్డి (బుజ్జి), ఈనాడు కృష్ణారెడ్డి పాత్రికేయ బృందం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరసపల్లి నాగేశ్వరరావు, దేశం పార్టీ నేత దత్తుడు శ్రీను, వైజాగ్ శ్రీను, చింత సురేష్ రెడ్డి, టీవీ9 గోపి, గంగాధర్ రెడ్డి, మణికంఠ రెడ్డి, ఆంధ్ర జ్యోతి కొండ, జెమిని ఆదిరెడ్డి, ఐ న్యూస్ రమేష్, ప్రైమ్ నైన్ శ్రీను, లైసెన్స్ శేఖర్ లు పాల్గొన్నారు.

## ఆఫర్ ఆఫర్ ఆఫర్ మీ పరిహారం చూసి వచ్చింది ఆఫర్

- వ్యాపారస్తులు వస్తున్నారు డబ్బు జాగ్రత్త సుమా....
- ముందుంది ముసళ్ళ పండుగ

**కుక్కునూరు/వేలేరుపాడు,పెన్ పవర్,జనవరి 09** :ముంపు మండలాల ప్రజలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు ఇచ్చింది.ఎప్పుడా ఎప్పుడా అంటూ ఏడు సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న ఆర్ అండ్ ఆర్ పరిహారం మొదటి 41.15 కంటూర్ లో ఉన్న గ్రామాలకు ఈ నెల నిర్వాసితుల ఖాతాల్లో డబ్బు జమ అయ్యింది.దీనితో ఒకింత సంక్రాంతి పండుగ ముందే వచ్చింది.వచ్చిన డబ్బును చక చకా కొంత విత్ డ్రా కూడా చేస్తున్నారు.ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారస్తులు కార్ కొంటారా ఆఫర్ ఉంది.బైక్ కొంటారా ఆఫర్ ఉంది అంటూ నిర్వాసితుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.కొందరైతే తెలంగాణలో వెంచర్స్ ఉన్నాయి.భూమి కొంటె మీ డబ్బు పదిలం అంటూ గిరి ప్రదక్షిణలు చేస్తున్నారు.ఒక నిర్వాసితుడికి వచ్చింది,రూ 6.8000,అందులో పై చెప్పినవి కొంటె తరలించే టప్పుడు ఖాళీ చేతులతో పోక తప్పదు.చేతినిండా డబ్బు ఉండటంతో జూదాల పిచ్చిలో ఈ సంక్రాంతి కి వ్యవసనాలకు బానిసైతే ఖజానా ఖాళీ కావటం తప్పదు.అన్లైన్ బెట్టింగులు,జూదాలకు వెళ్లేముందు ఒక్క సారి మీ కుటుంబాన్ని గుర్తు తెచ్చుకుంటే సక్సెస్ ఫుల్ జీవితం సాధించిన వారు అవుతారు.

**అధికారుల నియంత్రణ అవసరం**

గతంలో భూముల ప్యాకేజి రావటంతో పెద్దయెత్తున వాహనాలు కొనుగోలు చేశారు. తరచూ ప్రమాదాలు జరగడంతో కుక్కునూరు నుంచి భద్రాచలం వెళ్లే రహదారిపై స్పీడ్ బ్రేకర్స్ కూడా ఏర్పాటు చేశారు.ఇది గమనించిన అప్పటి పీఓ షాన్ మోహన్ అనధికారికంగా వెలసిన కొన్ని షోరూమ్స్ కు, బ్రేక్ లు వేశారు.ఇప్పుడు కూడా అధికారుల పర్యవేక్షణ ఎంతైనా అవసరం ఉందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## అన్నదాన పథకానికి రూ.1,01,116లు విరాళం



**అన్నవరం, పెన్ పవర్, జనవరి 9 :** అన్నవరం దేవస్థానం కొండపై దాతల విరాళాలతో నిర్విఘ్నంగా అమలుపరుస్తున్న సత్యదేవ నిత్య అన్నదాన పథకానికి దాత రూ.1,01,116లు విరాళంగా సమర్పించారు. విశాఖపట్నం కు చెందిన ధృతి శాంకరీ దేవి ఈ విరాళాన్ని కొండపైన గల ఈవో కార్యాలయంలో ఏఈఓ డివిఎస్ కృష్ణారావుకు గురువారం అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతి ఏటా జనవరి 23వ తేదీన బి. విజయలక్ష్మి పేరు మీద అన్నదానం జరిపించాల్సిందిగా దాత కోరారు.

రత్నగిరిపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష :

దేవస్థానం పరిపాలన అంశాలు పై స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారుల పనితీరు భక్తులకు అధికారులు కల్పిస్తున్న మౌలిక వసతులు, సౌకర్యాలు ,ఏర్పాట్లు తదితర అంశాలపై ఈవో వి. సుబ్బారావు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వెలువడిన ఆదేశాల మేరకు కొండపైన గల స్వామివారి నిత్య కళ్యాణ మండపం వద్ద ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు పలు అంశాలపై చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొండపైకి వచ్చిన దగ్గర నుంచి తిరుగు ప్రయాణం వరకు భక్తులు యాత్రికులు ఎటువంటి ఇబ్బందులు పడకూడదని ఈవో అధికారులకు సూచించారు. అన్ని విభాగాల అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని భక్తుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఏ ఈ ఓ లు, సూపరిండెంట్లు, సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా జన సైనికులు ఉండగా

సువర్ణ రాజు



**గోపాలపురం, పెన్ పవర్, జనవరి 9.**

వివిధ కారణాలతో ఇబ్బంది పడుతున్న బాధితులకు జనసేన సైనికులు ఎప్పుడు అండగా ఉంటారని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. నియోజకవర్గంలోని దేవరపల్లి మండలం సుబ్బరాయ పురం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు మూడు ఇల్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఆ బాధితులకు జనసేన పార్టీ నాయకులు తమ వంతు సహాయాన్ని గురువారం అందించారు. ఇల్లు దగ్ధమైన చాపల చంద్రమ్మకు పదివేల రూపాయలు నగదు 25 కేజీల బియ్యం నిత్యవసర వస్తువులు అందజేశారు. అలాగే మంద వెంకన్న, రామయ్య లకు ఒక్కొక్కరికి 2500 రూపాయలు 25 కేజీలు బియ్యం నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజానీకానికి ఎప్పుడు ఏ సమస్య తలెత్తిన ఆదుకోవడానికి జనసేన సైనికులు వీర మహిళలు సిద్ధంగా ఉంటారన్నారు. తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ని ఆదర్శంగా తీసుకుని తమ వంతు సహాయాన్ని బాధితులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాట్నం గణేష్, కృష్ణం పాలెం గ్రామ సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, జనసేన నాయకులు నాయకులు పోసి వెంకటరత్నం, చాపల నాగరాజు, ప్రసాద్, శేషు, బల్ల రాము, గంట సురేష్, ఆకుల నాని తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 9**: మండలంలోని రాజపూడి 33కెవి ఫీడర్ఫీడర్ నందు చెట్లు నరికివేత, మరమ్మత్తులు మరియు లైన్ ఏబీ స్విచ్ ఎరెక్షన్ కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున రాజపూడి, కొత్తూరు, మల్లిశాల, వెంగయమ్మాపురం, గోవిందపురం, కృష్ణాపురం, సీతారామపురం, జగ్గంపేట జేహెచ్సి, బాలాజీ రైస్ మిల్ ల కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి డిపార్ట్మెంట్ వారికి సహకరించాలని కోరారు.

## జనసేన ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శ



**జగ్గంపేట(కిర్లంపూడి), పెన్ పవర్, జనవరి 9:** కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన పెంకే చక్రం ఇటీవలే స్వర్గస్తులయ్యారు. విషయం తెలిసిన జగ్గంపేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ గురువారం చక్రం అబ్బాయిలు పెంకే వీరబాబు, పెంకే సత్యం వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఆయన వెంట మాదారపు వీరబాబు, మాజీ ఎంపీటీసీ పెంకే నాగేశ్వరావు, పిడుగు జయబాబు, పులి రంగారావు, మాదారపు సుబ్బారావు, మాదారపు సత్యనారాయణ, మాదారపు గౌరీ శంకర్, నెల్లి వెంకన్న, కళ్లేపల్లి వీరబాబు, పాలెక నరసయ్య, నెల్లి ఎంకాయమ్మ, సీత ఉన్నారు.

## అధికారులు ఇంకా జగన్మోహనరెడ్డి వ్యామోహంలోనే ఉన్నారా? ఎమ్మెల్యే నల్లమిల్లి...



**అనపర్తి,పెన్ పవర్,జనవరి 9**

రైతు భరోసా కేంద్రాల పేరుని కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసినప్పటికీ అధికారులు ఇంకా జగన్మోహన్ రెడ్డి వ్యామోహంలోనే ఉన్నారంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిక్కవోలు మండలం ఊలపల్లి రైతు సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించి పై విధంగా స్పందించారు. ఏడు మాసాల క్రితం తెలుగు ప్రజల ఆకాంక్ష మేరకు అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నాటి జగన్ పాలనలో రైతు భరోసా కేంద్రాలుగా ఉన్న వాటిని రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. కానీ ఇంతవరకూ మెజారిటీ చోట్ల అధికారులు రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేయకపోవడం దురదృష్టకరం. 25 రోజుల క్రితం జరిగిన జెడ్పీ సమావేశంలో ఈ అంశం గురించి తాను ప్రస్తావిస్తే దానికి వ్యవసాయశాఖ అధికారులు ఈవిషయాన్ని పంచాయితీరాజ్ శాఖకి అప్పజెప్పామని చెప్పారు. కానీ పంచాయితీ రాజ్ శాఖ అధికారులు ఏం చేస్తున్నారో అసలు ఈ రెండు శాఖల మధ్య సమన్వయం ఉందో లేదో కూడా తెలియడం లేదన్నారు. తర్వాత నాలుగైదు రోజులకు కొమరిపాలెంలో రైతుభరోసా కేంద్రంగానే ఉండటం తెలిసి జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో మాట్లాడితే వారు వెంటనే మార్పులు చేయిస్తాం అన్నారు. ఈరోజు ఇక్కడ కొత్త బిల్డింగ్ ఏర్పాటు చేసి దానికి రైతు సేవా కేంద్రం అని ఒక ఫ్లెక్సీ కట్టడం చాలా దురదృష్టకరమైన చర్యన్నారు.

పై విషయాలను తీవ్రంగా పరిగణించడం జరుగుతుందని దీనిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

ఇక్కడ ఉన్న ఏడి, ఏవో లకు ఏ భాధ్యతా పట్టదన్నారు. ఎరువుల కొరత ఉందని చెపితే అంతా సవ్యంగానే ఉందని చెపుతారు. ఏ రైతుకి ఎంత ఎరువు ఇచ్చారని అడిగితే వారి దగ్గర సమాధానం ఉండదు. అసలు ఇక్కడ భవనం నిర్మించిన సంగతే తనకు తెలియదంటారు.

ఏడు మాసాలైనా అధికారులు ఇంకా జగన్మోహనరెడ్డి వ్యామోహంలోనే ఉండటం తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నారు. ఆయన వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

## భాష్యం స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 9:** జగ్గంపేట రావులమ్మ నగర్ లోని భాష్యం స్కూల్ లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పచ్చని కొమ్మలు, తోరణాలు, ముగ్గులతో అలంకరించారు.

చిన్నారులు ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి యొక్క విశిష్టత విద్యార్థులకు తెలియజేశారు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజు మకర సంక్రాంతి అంటారని తెలియజేశారు. సంక్రాంతి హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండుగలలో ఒకటని, ఈ పండుగను మూడు రోజులు చేస్తారని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్చార్జ్ గోవిందరాజు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేజ్ - 1 ప్రారంభం

**కాకినాడ. పెన్ పవర్ జనవరి 9 :**సేవారంగంలో నైపుణ్యాన్ని మెరుగుపరచుకుని ఉపాధి అవకాశాలను పెంచుకుంటూ ఆర్థికంగా ఎదగాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. ప్రియంవద ఔత్సాహిక వృత్తిదారులకు సూచించారు. కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా "సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేజ్- 1" ను గురువారం భానుగుడి పాత మీ సేవ సెంటర్లో నిర్వహించారు. వృత్తిదారుల రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. ప్రియంవద ,టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. శైలజ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. ప్రియంవద మాట్లాడుతూ వడ్రంగి సేవలు, ప్లంబింగ్ సేవలు, కార్పెంటర్ సేవలు, గృహోపకరణాల రిపేరింగ్ సేవలు, బ్యూటిషియన్ సేవలు తదితర వృత్తులలో ఉన్నవారికి ప్రత్యేకంగా రూపొందించిన హోమ్ ట్రైయాంగిల్ యాప్ ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా సేవలను అందించనున్నామని తెలిపారు. ఔత్సహిక వృత్తిదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ,మెప్మా ద్వారా వృత్తిదారుల జీవన ఉపాధిని మెరుగుపరచి వారి ఆర్థిక స్థితిని మార్చడమే ధ్యేయంగా ఆర్పీలు పనిచేయాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ డి. వెంకట్రాజు, సిఓ లు, ఆర్.పి.లు, సిబ్బంది పాల్గొన్నారు.




## కె.జగన్నాథపురం హై స్కూల్ కు ప్రింటర్ బహుకరణ



**అమలాపురం రూరల్, పెన్ పవర్, జనవరి,9**

అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం ఉమామహేశ్వర జిల్లా పరిషత్ హై స్కూల్ లో 1997- 98 సంవత్సరం లో చదువుకున్న పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు కెనాన్ కలర్ ప్రింటర్ ను తమ గుర్తుగా బహుకరించారు. ఈ ప్రింటర్ ను గురువారం కొంతమంది విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సూర్య కుమారి కి అందజేశారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

## వేణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ



**అమలాపురం రూరల్, పెన్ పవర్, జనవరి,9:**అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ప్రభుత్వ ఆసుపత్రి నందు వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం గర్భిణి స్త్రీలకు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని 250 మందికి పౌష్టిక ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పి.గన్నవరం మండలం ప్రసాద్, హాస్పిటల్ గైనకాలజిస్ట్ శిరీష, డా.కోటేశ్వరరావు, డా.అప్పారి సూర్యనారాయణ, హెడ్ నర్స్ కుమారి, నల్లా పెద్ద కాపు, ,నల్లా ఫణి, బీవీ హనుమంతరావు, బొక్కా వెంకట రాము,కొర్లపాటి సూరిబాబు,జగత ప్రసాద్, తోలేటి సాయిబాబు, గుర్రం వీరబాబు, కొమ్ముల వెంకటేశ్వరరావు,మరియు తదితరులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలి.

● ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 9:** సంస్కృతి సత్ సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలి అని ప్రధానోపాధ్యాయురాలు ఎన్ లక్ష్మీ తులసి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. భారతీయ సాంప్రదాయాల్లో ధనుర్మాసంలో వేసే రంగవల్లులు, గొబ్బెమ్మలు, భోగి మంట పాఠశాల ఆవరణలో తీర్చిదిద్ది సంక్రాంతి పండగ వాతావరణం నెలకొల్పారు. గంగిరెద్దు ను అలంకరించి సాంప్రదాయ బద్ధంగా పూజలు అందించారు. గంగిరెద్దు నృత్యాన్ని బాలలు తిలకించారు. హరి హరిదాసు సంకీర్తనలు చేస్తూ పాఠశాల ఆవరణంలో సందడి చేశారు. బాల బాలికలు ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు వేసుకొని భోగిమంట, రంగవల్లుల చుట్టూ సాంప్రదాయ పాటలతో బృంద గానం చేస్తూ సంక్రాంతి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.లక్ష్మీ తులసి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయడం మన బాధ్యత అన్నారు.దీనిలో భాగంగానే సంక్రాంతి సంబరాలు జరుపుకునే విధానాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించేలా పాఠశాలను సంక్రాంతి సంబరాలు నిర్వహించామన్నారు.అనంతరం ఎస్ఎంసి చైర్మన్ కర్రోతు గాంధీ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణ కలిగి విద్యను అభ్యసించడంతోపాటు, ఉపాధ్యాయుల పట్ల గౌరవభక్తి భావాలతో మెలగాలి అన్నారు. అలాగే సమాజంలో జరిగే సనాతన హిందూ సాంప్రదాయాలను ఆచరించాలన్నారు. పండుగలు సమాజంలో ఐకమత్యాన్ని పెంచడమే విద్యార్థుల్లో నూతన ఉత్సాహం ఏర్పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి వైస్ చైర్మన్ కె.సూర్య కుమార్,ఉపాధ్యాయులు వెన్నా శ్రీనివాసరావు,ఎం.లోవ ప్రసాద్,ఎం. చిన్నబాబు,ఎ.సూరన్న దొర,ఎస్ఎంసి సభ్యులు,ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో తుమ్మలపల్లి



**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 9:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నేడు పిఠాపురం పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా నేడు జరగబోయే పర్యటన కార్యక్రమాల పనులను గురువారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, కలెక్టర్ షాన్ మోహన్, పిఠాపురం జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తో కలిసి జగ్గంపేట జనసేన ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్, ప్రత్తిపాడు జనసేన ఇన్చార్జ్ వరుపుల తమ్మయ్య బాబు పరిశీలించారు.

# ఇండస్ట్రీ అసోసియేషన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులుగా మనోజ్ కుమార్, నరిసే సోమేశ్వరరావు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 9:** ఉంగుటూరు ఇండస్ట్రీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మనోజ్ కుమార్ సోంకర్
ప్రధాన కార్యదర్శిగా నరిసె సోమేశ్వరరావు ఎన్నికయ్యారు.
ఉపాధ్యక్ష్యులు గా తొట్టల గణపతి సత్యనారాయణ, కార్యదర్శి గా కొండ్రెడ్డి వీర వెంకట సత్య శ్రీనివాస్, కోశాధికారి గా గుణ్ణం నరేన్ చౌదరి, గౌరవ సభ్యులుగా పసుపులేటి వెంకట రామారావు, అత్యం నాగ సుబ్రమణ్యం, నారాయణపురపు శివ, భలే అనంత కృష్ణంరాజు ఎన్నికయ్యారు.

# రుణాల రికవరీ లక్ష్యాలను పూర్తి చేయాలి

ఎంపీడీవో రామకృష్ణ




**గంగవరం, పెన్ పవర్, జనవరి9:** మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఇచ్చిన రుణాల రికవరీ లక్ష్యాలను వెలుగు సిబ్బంది పూర్తి చేయాలని ఎంపీడీవో పి జి రామకృష్ణ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు ఏపీఎం షణ్ముఖేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన బ్యాంకర్లు వెలుగు సిబ్బంది తో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, ఉమెన్ లీడ్ ఎంటర్ప్రైజెస్ ల ఏర్పాటు కు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు .డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించే విధంగా సిబ్బంది కృషి చేయాలని, అలాగే సకాలంలో రుణాలు చెల్లించిన సంఘాలకు తిరిగి రుణాలు మంజూరయ్యే విధంగా బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం స్టేట్ బ్యాంక్ మేనేజర్ జగదీష్, క్యాష్ ఆఫీసర్ లక్ష్మణరావు, వెలుగు సిసిలు అప్పారావు, శ్రీనివాసరావు, గణపతి, సుశీల, మోహన్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# సేవ కోసమే ఎన్నుకున్నారు... సత్కారాల కోసం కాదు... ఎమ్మెల్యే నల్లమిల్లి...





**అనపర్తి,పెన్ పవర్,జనవరి 9:** ప్రజలు తమను ఎన్నుకున్నది సేవ చేసేందుకే కానీ సత్కారాలు పొందేందుకు కాదని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన అనపర్తి పంచాయతీ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు అందించే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా పరిశుద్ధ కార్మికులకు వేతనాలు ఇస్తూ ఉపాధిని కల్పిస్తుంది అన్నారు. సిబ్బంది ఆయా గ్రామాల ప్రజలకు సేవలు అందించడంలో గురుతర బాధ్యతను వహించాలన్నారు. విధి నిర్వహణలో సక్రమంగా పనిచేస్తూ గ్రామాలను సుందరంగా ఉంచాలన్నారు. ప్రజలకు ప్రధానంగా దగ్గరలో ఉండే కార్యాలయం పంచాయితీ కార్యాలయం అన్నారు. దానిని గత ప్రభుత్వాల సమయంలో ఆర్థిక వనరులకు అడ్డాగా చేసుకుని పాలన సాగించే వారిని అటువంటి అరాచకాలకు అవినీతులకు దూరంగా ఉంటూ పారదర్శక పరిపాలన అధికారులకు సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. నాటి అధికారపక్ష సభ్యులు చేసిన ఆగడాల కారణంగానే గ్రామంలో వ్యతిరేకత పెరిగి గడచిన సార్వత్రిక ఎన్నికలలో ఎనిమిది సార్లు పోటీ చేసిన తెలుగుదేశం పార్టీకి రాని మెజారిటీ తనకు అందించడం జరిగిందని కూటమి కార్యకర్తలు ప్రజల పట్ల విధేయతతో మెలిగి వారి మనసులను గెలుచుకోవాలన్నారు. అనంతరం అధికారులు పారిశుద్ధ్య కార్మికులు సత్కారాన్ని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సున్నితంగా తిరస్కరించారు. అయినప్పటికీ వారు పట్టు పట్టడంతో అన్య మనస్కంగానే ఒప్పుకుంటూ భవిష్యత్తులో ఇటువంటి సత్కారాలను మానుకోవాలని,అధికారులకు అభిమానులకు సున్నితంగానే సూచించారు. కార్యక్రమంలో తూర్పు డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కర్రి శేషారత్నంలు ప్రభుత్వ విధానాలను, పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలను చెక్కుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వారాకుమారి, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, కర్రి వెంకన్న బాబు, రాధా, బాబా కూటమి నేతలు పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం.



నిర్వాసితులతో గ్రీవెన్స్ నిర్వహించిన...

ఐటీడీఏ పీవో సింహాచలం.

సబ్ కలెక్టర్ కల్ప శ్రీ..

**దేవీపట్నం,పెన్ పవర్, జనవరి9:** పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు ఆర్.అండ్.ఆర్ నిబంధనలు ప్రకారం ప్యాకేజి అమలు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు.గురువారం స్థానిక మండలం దేవీపట్నం మండలం తాసిల్దారు వారి కార్యాలయంలో పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సంబంధించిన గిరిజనులకు ల్యాండ్ టు ల్యాండ్ అదేవిధంగా భూములు కోల్పోయిన ముంపు బాధితులకు నష్టపరిహారం ఏర్పాటు చేయుటకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం,రంపచోడవరం సబ్ కలెక్టర్ కె ఆర్.కల్పశ్రీ ముంపు బాధితులతో గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితు లైన గిరిజనులకు వ్యవసాయానికి అనుగుణంగా ల్యాండ్ టు ల్యాండ్ ఏర్పాటు చేయుటకు అదేవిధంగా భూములు కోల్పోయిన ముంపు బాధితులకు నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు అర్హులైన వారికి పూర్తిస్థాయిలో పరిశీలించి బాధితుల అర్హతను బట్టి ఆర్.అండ్.ఆర్ ప్యాకేజీ అమలు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్లు,సుబ్బారావు,త్రిమూర్తులు,తదితరులు పాల్గొన్నారు.

# నేడు తాళ్లూరులో వెంకటేశ్వరస్వామి ఉత్తరద్వార దర్శనం





భారీగా తరలిరానున్న భక్తులు

**జగ్గంపేట(గండేపల్లి), జనవరి 9:** గండేపల్లి మండలంలో తాళ్ళూరు గ్రామంలో కోరిన కోర్కెలు తీర్చే వెంకటేశ్వరస్వామిగా శతాబ్దాల చరిత్ర ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో ఉనమట్ల రాజేష్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దాపర్తి సీతారామయ్య తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 4గంటలు నుంచే ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశముండడంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఆలయంలో ఏకాహం, స్వామి వారికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం గరుడ వాహనం, హంస వాహనం, ఆస్య వాహనం, ఆంజనేయస్వామి, శేష వాహనాలను గ్రామంలో ఊరేగించడం జరుగుతుందని వారు తెలిపారు.

# బాపూజీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు





**గోపాలపురం,పెన్ పవర్, జనవరి 9:** గోపాలపురంలో శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం వద్ద ఉన్న శ్రీ బాపూజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో ప్రిన్సిపల్ గూడూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సాంప్రదాయ బద్ధంగా జరిగిన ఈ సంబరాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని అక్కడ జరిగే సన్నివేశాలను తిలకించారు. భోగి మంటలు, హరిదాసుడికి భిక్షాటన చేయడం, విద్యార్థుల విచిత్ర వేషధారణలతో విన్యాసాలు వంటివి చూపర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళా ఉపాధ్యాయురాలులు భోగిమంట చుట్టూ చేరి పాటలు పాడుతూ నృత్యం చేశారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో చూపర్లను ఆకట్టుకున్నారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ప్రతి ఏటా పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు చేస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

# దేశ సంస్కృతిని తెలిపేది సంక్రాంతి - శివ నారాయణ రెడ్డి



**గోపాలపురం/నల్లజర్ల, పెన్ పవర్, జనవరి 9:** హిందువులు అత్యంత ఘనంగా జరుపుకునే సంక్రాంతి పండుగ భారతీయుల యొక్క సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పడుతుంది అని భాష్యం విద్యాసంస్థల జోనల్ అధికారి ఏ.శివ నారాయణ రెడ్డి అన్నారు. నల్లజర్ల లోని భాష్యం పాఠశాలలో ప్రిన్సిపల్ జీ.వై.రాజు అధ్యక్షతన గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ,అలాగే చిన్నారుల విచిత్ర వేషధారణలు, సాంప్రదాయ దుస్తులు చూపర్లను ఆకర్షించుకున్నాయి. ఈ సందర్భంగా జోనల్ అధికారి మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు విద్యతోపాటు విలువలు,సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సంక్రాంతి నృత్యాలు ,భోగిమంటల కార్యక్రమాలు అలరించాయి. సంక్రాంతి సంబరాల్లో సామ్స్ ప్రిన్సిపల్ కే.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు,





**కె గంగవరం పెన్ పవర్ జనవరి 9:** కె గంగవరం మండలం లో అన్ని పాఠశాలల్లోనూ సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.కె గంగవరం మండలం బాలాంత్రం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగ ఘనంగా నిర్వహించారు.సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చింది అన్నట్లుగా విద్యార్థిని విద్యార్థులు ఆట పాటలతో అలరించారు సంక్రాంతి రాకుండానే ముందుగా భోగి మంటలు వెలిగించారు.విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు.బాలలచే హరిదాసు,గంగిరెద్దుల వారు,బుడబుక్కల వారు,సోది అమ్మ, తదితర వేషధారణ చేయించడమైనది.బాలికలచే గొబ్బెమ్మలు పెట్టించడమైనది.కోలాటం,గాలిపటాలు మొదలగు కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.చిన్న పిల్లలకు భోగి పళ్ళు పొయించి చివరగా భోగి మంట వేయించడమైనది.సంక్రాంతి విశిష్టతను అందరికీ తెలియచేయడమైనది.ప్లాస్టిక్ భూతం వేష ధారణ ద్వారా ప్లాస్టిక్ పర్యావరణానికి చేస్ హానిని తెలియచేసి సామాజిక సందేశం ఇవ్వడమైనది.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరాల కృష్ణ కుమార్,ఎస్ఎంసి ఛైర్మన్ విత్తనాల వీరబాబు,వైస్ ఛైర్పర్సన్ దార్ల అనిత,సహయోపద్యాయురాలు ఎం.దుర్గ దేవి,సర్పంచ్ సిహెచ్.సాంబశివరావు,ఎంపీటీసీ కోట సత్తిబాబు,ఉప సర్పంచ్ తోలేటి కృష్ణమూర్తి,గ్రామ పెద్దలు మల్లిపూడి బుజ్జి,చిక్కం విజయబాబు,ఉంగరాల భీమా శంకరం,మోహన్,రాముడు,బాబ్జీ మరియు తల్లితండ్రుల పాల్గొన్నారు.అదేవిధంగా మండల కేంద్రమైన కే గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు భోగిమంటలు వెలిగించి సంప్రదాయ దుస్తులలో అలరించారు.దంగేరు జిల్లా పాఠశాలలో శంకరం సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు.హరిదాసులు వేషధారణలో విద్యార్థులు అలరించారు.కె గంగవరం మండలం పాతకోట మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.సంక్రాంతి ముందుగా వచ్చినట్లే ఉన్నది.

## జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన నరసింహ కాశ్యప్

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 09:**ఇటీవల మంగళగిరిలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 17 క్రికెట్ పోటీలలో ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన కెప్టెన్ పెద్దింటి నరసింహ కాశ్యప్ జట్టు తృతీయ స్థానంలో గెలుపొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికయింది.13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనగా తూర్పుగోదావరి జిల్లా జట్టు సత్తాచాటింది. ఈ జట్టు కోచ్ గా తోట రవి ఉండగా కెప్టెన్ గా నరసింహ కాశ్యప్ వ్యవహరించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తాచాటి జాతి స్థాయి పోటీలకు ఎంపికైన నరసింహ కాశ్యప్ ను పలువురు గ్రామస్తులు అభినందించారు.

## పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు బహుకరణ.



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 09:**ఆలమూరు మండలం పెదపల్ల గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి సంక్రాంతి పండుగ సందర్భంగా కూటమి నాయకులు, సలాది నాగేశ్వరరావు,సర్పంచ్ ఏడిద సత్యశ్రీ మెహెర్ ప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ ఓబ్బిలిరెడ్డి వేణీ ఆధ్వర్యంలో గురువారం నూతన వస్త్రాలను అందజేశారు. పారిశుద్ధ్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## దాలిపాడు పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



**వై రామవరం, పెన్ పవర్, జనవరి 9 :** దాలిపాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి సంబరాలను గురువారం జరుపుకున్నారు.

శుక్రవారం నుండి సంక్రాంతి సెలవులు కావడంతో గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తుగా భోగిమంట వేసి సంబరాలు చేసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు గొబ్బెమ్మ లాట ఆడుతూ సంతోషంతో కేరింతలు కొట్టారు. సంక్రాంతి పండుగ యొక్క విశిష్టతను విద్యార్థినులకు ఉపాధ్యాయులు వివరించారు.

## సిద్ధార్థ స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు.





**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 09:**మండల కేంద్రంలోని శ్రీ సిద్ధార్థ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు పాఠశాల డైరెక్టర్ కె.ముల్లారావు ఆధ్వర్యంలో విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ యొక్క విశిష్టతను వివరిస్తూ సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన రోజే సంక్రాంతి అని అన్నారు. రైతులందరూ పంట చేతికి వచ్చిన ఆనందంతో ఈ పండగ జరుపుకుంటారన్నారు. ఇది మూడు రోజులు పండగ అని పాతను వదిలి కొత్త తనం స్వీకరణకు గుర్తుగా భోగిని పితృదేవతలను ఆరాధనలో భాగంగా సంక్రాంతిని వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉన్న పశువులను పూజించడంలో భాగంగా కనుమను జరుపుకుంటారన్నారు. విద్యార్థులందరూ ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, కోడి పందాలు, గాలిపటాల ప్రదర్శన, బొమ్మల కొలువులు, గొబ్బెమ్మలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ముల్లారావు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు





**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 9**: జగ్గంపేటలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పూర్ణిమ తెలిపారు. గురువారం జగ్గంపేట ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పలు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాజెక్టు అధికారిణి పూర్ణిమ అధ్యక్షతన నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు జగ్గంపేట తహసిల్దార్ జెవిఆర్ రమేష్, ఎంపీడీవో ఎ.చంద్రశేఖర్, ఏపీఎం బి.ప్రశాంతి, ఈవో పిఆర్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుండలో పాలు పొంగించి, భోగి మంటలు వేసి, చిన్నారులతో హరిదాసు వేషధారణలు వేయించారు. అనంతరం చిన్నారుల తల్లులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి మణికర్ణిక యువజన సంఘం ఏర్పాటుచేసిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మణికర్ణిక యువజన సంఘం అనూష, వీరు, వినీల, చిన్ని, శ్రీను, రమేష్, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

# బరకాల గోదాము దగ్ధం..





**యజమానిని పరామర్శించిన ఎమ్మెల్యే నల్లమిల్లి...**

**అనపర్తి,పెన్ పవర్,జనవరి 9**

బిక్కవోలు మండలం పందలపాకలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతి అయ్యింది. కానూరి శంకర్రావు కు చెందిన బరకాల గోడౌన్ లో మంటలు వేగంగా చెలరేగడంతో గోడౌన్ పాక్షికంగా దగ్ధమైంది. గ్రామంలోని యువకులు అందుబాటులో ఉన్న నీటితో మంటలు ఆరిపే ప్రయత్నం చేశారు. అదే సమయంలో గ్రామ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విషయం తెలుసుకుని హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితు శంకర్రావు ను పరామర్శించారు. బాధితుడు శంకరరావును అగ్ని ప్రమాదం వలన నష్టపోయిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల శంకర్రావు మాట్లాడుతూ సుమారు రూ.5 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధికారులు, అనపర్తి నియోజకవర్గ ఎన్డీఏ నాయకులు, బిక్కవోలు మండల ఎన్డీఏ నాయకులు, పందలపాక గ్రామ ఎన్డీఏ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం



**వై రామవరం, పెన్ పవర్,జనవరి 9:** వై. రామవరం మండల సర్వసభ్య సమావేశం గురువారం వాడి వేడిగా జరిగింది. ఎంపీపీ ఆనందరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం మీటింగ్ హాల్లో వాడిగా వేడిగా జరిగింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన జన్ మన్ పథకంలో మంజూరైన గృహాలు మధ్యలో ఆగిపోకుండా కాంట్రాక్టర్లతో నిర్మాణాలు పూర్తి చేయించాలని ఎంపీపీ, ఎంపీటీసీ కే.

రమణ డిమాండ్ చేశారు. భవనాలు లేని పాఠశాలలకు భవనాలు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. పుట్ట గండి పాఠశాలలో ఉపాధ్యాయుడు విధులకు హాజరు కావడం లేదని, అతడి పై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ,ఎంఈఓ కు సూచించారు. భూమి పంపకాలలో లేట్ డెత్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నారని, లేట్ డెత్, లేట్ బర్త్ సకాలంలో అందివ్వాలని తాసిల్దార్ కు సూచించారు. ఏజెన్సీలో కేటగిరి టు మీటర్లు ఇచ్చేందుకు పిఓ పర్మిషన్ తీసుకోవాలని నిబంధనలతో గిరిజన వ్యాపారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాటి గురించి చర్యలు తీసుకోవాలని సభ్యులు తెలిపారు. సమావేశాలకు ప్రజా సమస్యలతో సుదూర ప్రాంతాల నుంచి ప్రజా ప్రతినిధులు వస్తున్న పలుశాఖల అధికారులు హాజరు కావడం లేదని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీటీసీ రమణ ఎంపీడీవో రవికిషోర్ ను కోరారు. ఈ సర్వసభ్య సమావేశానికి జడ్పిటిసి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ,జోగిరెడ్డి, తాసిల్దార్ పి. వేణుగోపాల్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు.

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు..
- రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు..
- ఆర్థిక సాయం కోసం ఎదురుచూపులు..



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 09:**ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామానికి చెందిన పిల్లా సత్య వెంకటరమణ(38) అనే యువకుడు గత కొంతకాలంగా పొట్టకూటి కోసం మండపేటలోని ఒక రైస్ మిల్లులో పనిచేసుకుంటూ రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో తన తల్లిని,భార్యని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఎప్పటిలాగానే శుక్రవారం రాత్రి రైస్ మిల్లులో డ్యూటీ నిమిత్తం వెళుచుండగా కొత్తూరు సెంటర్లోని శ్రీ మురళీకృష్ణ గొడన్ ఎదురుగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వెంకటరమణ పూర్తిగా గాయాలపాలయ్యాడు.తలకు బలమైన గాయం శరీరంలో పలుచోట్ల ఎముకలు విరిగిపోవడంతో స్థానికుల సహకారంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు మెరుగైన వైద్యాన్ని అందించాలని, దానికి సుమారు 15 లక్షల ఖర్చుతో కూడిన వైద్యం అందించవలసిన ఉంటుందని వైద్యులు తెలియజేశారు. అయితే ఇంత భారీ మొత్తంలో డబ్బులు చెల్లించుకోలేక దిక్కుతోచని స్థితిలోఎవరైనా ఆర్థిక సాయం అందిస్తారని కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఎవరైనా ఆర్థిక సాయం చేసే దాతలు ముందుకు వస్తే 95051 69398 (ఫోన్ పే, గూగుల్ పే) ద్వారా ఈ ఫోన్ నెంబర్ను సంప్రదించవచ్చని వారు కోరి ఉన్నారు.

## అమిత్ షా వ్యాఖ్యలు భారత రాజ్యాంగానికే అవమానం- విశ్వేశ్వర రెడ్డి




**గోపాలపురం,పెన్ పవర్, జనవరి 9**:కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు భారత రాజ్యాంగానికే ఘోర అవమానకరమని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి కే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గోపాలపురంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షులు మట్టపర్తి రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలపై అధికార టిడిపి, జనసేన పార్టీలతోపాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్పందించకపోవడం వారి ద్వంద వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల సమయంలో అంబేద్కర్ పేరు వాడుకుని ఓట్లు అడుగుతారే తప్ప ఇలాంటి సమయంలో ఆయనకి అవమానం జరిగితే పట్టించుకోరా అని ప్రశ్నించారు. పాపాలు చేసిన వారే పుణ్యం కోసం అమిత్ షా మాదిరిగా వ్యాఖ్యలు చేస్తారని అన్నారు. దేశ ప్రజలు ,రాజ్యాంగా పరిరక్షణ గురించి తపించేవాళ్లు అంబేద్కర్ పేరును జపిస్తూ ఉంటారన్నారు. పార్లమెంట్ నిండు సభలో రాజ్యాంగ నిర్మాతను అవహేళన చేయడం దేశ ప్రజలను కించపరిచినట్టే అన్నారు. భారత రాజ్యాంగ స్థానంలో మనుస్మృతిని ప్రవేశపెట్టాలనుకున్న ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో తగిన మెజారిటీ రాకపోవడం పై అసహనంగా ఉన్నారన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలన్న కల నెరవేరకపోవడంతో ఇటువంటి కార్యక్రమానికి పూనుకుంటున్నారని ఆరోపించారు. అయితే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ ఇటువంటి విషయాలను చూస్తూ ఊరుకోరు అని తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. అనంతరం కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ మార్టిన్ లూథర్, పిసిసి సభ్యులు జేష్ఠ సతీష్ బాబులు సైతం మాట్లాడి దేశంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గండిన రామారాయుడు, విల్లూరి రమేష్, కౌలూరి రతన్ రాజు, బాబాజీ రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సునీల్, ఫ్రాన్సిస్, మురళీకృష్ణ, భద్రరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఫామ్‌లో ఉన్నా పక్కన పెట్టారు.. విజయ్ హజారే ట్రోఫీలో చాహల్‌పై వేటు




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌కు బ్యాడ్ టైం నడుస్తుంది. ఫామ్ లో ఉన్నప్పటికీ భారత క్రికెట్ జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్న చాహల్ కు వ్యక్తిగత జీవితం అంత సాఫీగా లేనట్టు తెలుస్తోంది. అతని భార్య ధనశ్రీ వర్మతో త్వరలో విడాకులు తీసుకోబోతున్నాడనే వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇటీవలే ఇంస్టాగ్రామ్ లో ధనశ్రీ వర్మ ఫోటీలు డిలీట్ చేయడంతో వీరిద్దరి మధ్య విడాకులకు మరింత బలం చేకూరింది. ఇదిలా ఉంటే చాహల్ కు మరో షాక్ తగిలింది. విజయ్ హజారే ట్రోఫీ కోసం అతడ్ని ఎంపిక చేయలేదు. హర్యానా నేడు (జనవరి 9) క్వార్టర్ ఫైనల్ లో బెంగాల్ తో తలబడుతుంది. కీలకమైన నాకౌట్ మ్యాచ్ లకు చాహల్ ను ఎంపిక చేయకుండా పక్కన పెట్టడం ఆశ్చర్యానికి గురి చేసింది. చాహల్ తన భార్య ధనశ్రీ నుండి విడాకులు తీసుకుంటారనే అనే ఊహాగానాలు ఎక్కువయ్యాయి. ఈ కారణంగానే చాహల్ ను ఎంపిక చేయలేదనే వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వార్తల్లో నిజం లేదని తేలిపోయింది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమ ప్రధాన స్పిన్నర్ చాహల్ ను పక్కన పెట్టాలని నిర్ణయం తీసుకున్నామని హర్యానా క్రికెట్ అసోసియేషన్ అధికారి తెలిపారు. యువ స్పిన్నర్ పార్థ్ వాట్స్‌కు ఎక్కువ అవకాశాలను ఇవ్వడానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపాడు.

చాహల్ ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. గత సీజన్ లో హర్యానా టైటిల్ గెలవడంతో చాహల్ కీలక పాత్ర పోషించాడు. 18 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ప్రస్తుతం చాహల్ కు భారత జట్టులో చోటు దక్కడం కష్టంగానే కనిపిస్తుంది. టీ20 వరల్డ్ కప్ 2024 స్క్వాడ్ లో స్థానం దక్కినా అతనికి ఆడే అవకాశం రాలేదు. ఆ తర్వాత సెలక్టర్లు చాహల్ పూర్తిగా పక్కన పెట్టేశారు. భవిష్యత్ లోనూ చాహల్ భారత జట్టులోకి రావడం కష్టంగానే కనిపిస్తుంది. అతని వయసు 34 ఏళ్ళు కావడం దీనికి ప్రధాన కారణం. 34 ఏళ్ల చాహల్ ఇప్పటివరకు భారత్ తరపున 72 వన్డేలు, 80 టీ20లు ఆడాడు. రెండు ఫార్మాట్లలో కలిపి 217 వికెట్లు పడగొట్టాడు.

# ఆస్ట్రేలియన్ ఓపెన్.. భారత టాప్ ర్యాంకర్‌కు కఠినమైన డ్రా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 పురుషుల సింగిల్స్ డ్రా విడుదలైంది. భారత స్టార్ ఆటగాడు సుమిత్ నాగల్ కు తొలి రౌండ్ లోనే కఠిన సవాలు ఏర్పడింది. సుమిత్ మొదటి రౌండ్‌లో ప్రపంచ నం.25 టోమస్ మచాక్‌తో తలపడనున్నాడు. తొలి రౌండ్ లు గెలిస్తే 24 గ్రాండ్ స్లామ్స్ టైటిల్స్ విజేత జొకోవిచ్ తో తలపడే అవకాశం ఉంది. 27 ఏళ్ల నాగల్ ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 98వ స్థానంతో మెయిన్‌డ్రాలో నేరుగా ప్రవేశించాడు. 2024 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాగల్ రెండో రౌండ్ కు చేరుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ ప్రపంచ నం.1 జానిక్ సిన్నర్ మొదటి రౌండ్‌లో నికోలస్ జార్రీతో తలపడనున్నాడు. జొకోవిచ్, అల్కరాజ్ ఒకే డ్రా లో ఉండడంతో స్థాయికి తగ్గట్టు ఆడితే సిన్నర్ ఫైనల్ కు చేరుకోవచ్చు. చారిత్రాత్మక 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం నొవాక్ జొకోవిచ్.. కెరీర్ గ్రాండ్‌స్లామ్‌ను పూర్తి చేయాలనే ఆశతో కార్లోస్ అల్కరాజ్ టైటిల్ గెలవాలనే లక్ష్యంగా బరిలోకి దిగనున్నారు. వీరిద్దరూ తొలి నాలుగు రౌండ్ లు దాటితే బ్లాక్‌బస్టర్ క్వార్టర్ ఫైనల్ పోరును వీరిద్దరి మధ్య చూడొచ్చు.

మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ అరీనా సబలెంకా వరుసగా మూడో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గాలని ఆరాటపడుతుంది. తొలి రౌండ్‌లో ఆమె 2017 యూఎస్ ఓపెన్ ఛాంపియన్ స్లోన్ స్టీఫెన్స్‌తో తలపడనుంది. సెమీ-ఫైనల్‌లో ప్రపంచ నం.3 కోకో గౌఫ్‌తో సబాలెంకా కఠినమైన పరీక్ష ఎదురు కానుంది. ఐదు సార్లు గ్రాండ్ స్లామ్ విజేత ఇగా స్వియాటెక్ కాటెరినా సినియాకోవాతో ప్రారంభ రౌండ్‌లో తలపడుతుంది.

# ఛేజింగ్‌లో సంచలనం.. చివరి ఓవర్‌లో 30 పరుగులు కొట్టి గెలిపించిన నురుల్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 క్రికెట్ లో సంచలనం నమోదు చేసుకుంది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ లో రంగపూర్ రైడర్స్ సంచలన ఛేజింగ్ తో అద్భుత విజయం సాధించింది. ఫార్చ్యూన్ బరిషల్ తో జరిగిన మ్యాచ్ లో చివరి ఓవర్ లో రంగపూర్ రైడర్స్ విజయానికి 26 పరుగులు కావాలి. ఈ దశలో రైడర్స్ కెప్టెన్ నురుల్ హసన్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. కైల్ మేయర్స్ వేసిన ఈ ఓవర్ లో ఏకంగా 30 పరుగులు రాబట్టాడు. తొలి బంతికి సిక్సర్ కొట్టిన అతను.. ఆ తర్వాత వరుసగా రెండు ఫోర్లు బాదాడు. చివరి మూడు బంతుల్లో సమీకరణం 3 బంతుల్లో 12 పరుగులకు వచ్చింది. తొలి రెండు బంతులకు సిక్సర్, ఫోర్ కొట్టి మ్యాచ్ ను మలుపు తిప్పాడు. చివరి బంతికి రెండు పరుగులు చేయాల్సిన దశలో సిక్సర్ కొట్టి బాది ఊహించని విజయాన్ని అందించాడు. 198 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కుష్‌దిల్ షా (48), ఇఫ్తికార్ అహ్మద్ (48) భాగస్వామ్యంతో రంగాపూర్ మ్యాచ్ లోకి వచ్చింది. వీరిద్దరూ 91 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి విజయంపై ఆశలు రేకెత్తించారు. స్వల్ప వ్యవధిలో ఇద్దరూ ఔట్ కావడంతో మ్యాచ్ ఫార్చ్యూన్ బరిషల్ వైపు మళ్లింది. నురుల్ హసన్ పవర్ హిట్టింగ్ తో 7 బంతుల్లో 3 ఫోర్లు.. 3 సిక్సర్లతో 32 పరుగులు చేసి ఓడిపోయే మ్యాచ్ ను గెలిపించాడు. అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన ఫార్చ్యూన్ బరిషల్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 197 పరుగుల భారీ స్కోర్ చేసింది. కైల్ మేయర్స్ 29 బంతుల్లో 7 సిక్సర్లతో 61 పరుగులు చేశాడు. ఓపెనర్లు తమీమ్(40), శాంటో(41) రాణించారు.

# షార్ట్ డ్రెస్లో ఆరియానా ఎక్స్పోజింగ్



ఒకప్పుడు తెలుగు తెర పై లోకల్ అమ్మాయిల కు అవకాశాలు దొరకాలంటే చాలా కష్టంగా ఉండేది. అయితే ఇప్పుడు మాత్రం చాలా మంది యువతులు సినిమాల్లోనో షోలలోనో సీరియళ్లలోనో అవకాశాలు దక్కించుకుంటోన్నారు. అలాంటి వారిలో బోల్డ్ బ్యూటీ ఆరియానా గ్లోరీ ఒకరు. సెన్సేషనల్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ పుణ్యమా అని ఈ అమ్మడు అప్పట్లో ఫుల్ ఫేమస్ అయింది. మొదట్లో యూట్యూబ్ యాంకర్ గా చేసిన ఆరియానా గ్లోరీ.. బిగ్ బాస్ నాలుగో సీజన్ లోకి కంటెస్టెంట్గా వెళ్లి మరింత సెన్సేషన్ అయింది. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా దూసుకుపోతోన్న ఈ పిల్ల.. వరుసగా సినిమా షోలు చేస్తూ సత్తా చాటుతోంది. ముఖ్యంగా బిగ్ బాస్ బజ్ బిగ్ బాస్ నాన్ స్టాప్ బీబీ జోడీ షోల తో ఆరియానా గ్లోరీ తన క్రేజ్ను రెట్టింపు చేసుకుందని చెప్పుకోవచ్చు. కెరీర్ పరంగా సక్సెస్ఫుల్ గా దూసుకుపోతోన్న ఆరియానా గ్లోరీ.. సోషల్ మీడియాలోనూ అదే రీతిలో హడావిడి చేస్తోంది. ఇందులో భాగంగానే నిత్యం ఈ అమ్మడు ఫొటోనో వీడియోనో రీల్స్ని ఇన్స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేస్తూనే ఉంటోంది.

# యువ నటులు వరస్ట్.. పాత తరమే బెస్ట్.. హీరోయిన్ కామెంట్



పరిశ్రమలో పురుషాధిక్యాన్ని ప్రశ్నించే కథానాయికల్లో మలయాళీ కథానాయిక పార్వతి తిరుమోతు పేరు రెగ్యులర్ గా వినిపిస్తుంది. వీలున్న ప్రతి వేదికపైనా మేల్ డామినేషన్ ని నిలదీసేందుకు పార్వతి వెనకాడరు. గతంలో హేమ కమిటీ ఆరోపణల అనంతరం అమ్మా (మలయాళ ఆర్టిస్టుల సంఘం) అధ్యక్ష పదవికి రాజీనామా ఇచ్చిన సూపర్ స్టార్ మోహన్ లాల్ ని కూడా పార్వతి వదిలిపెట్టలేదు. అంత పెద్ద హీరోపైనా ఘాటైన వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు యువతరం నటీనటులపై ఓ ఈవెంట్లో ఈ భామ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిగ్గా మారాయి. ఇంతకీ పార్వతి ఏమని కామెంట్ చేసారు? అంటే....

పాత తరం తారలతో పోలిస్తే నేటితరం నటీనటులు వరస్ట్ అని పార్వతి వ్యాఖ్యానించారు. మలయాళ యువ నటులు సోమరితనం, నిరాశను ప్రదర్శిస్తారని విమర్శించారు. వయనాడ్ లిటరేచర్ ఫెస్టివల్‌లో పార్వతి మాట్లాడుతూ.. యువ నటులకు ఇండస్ట్రీ లో ఏం జరుగుతుందో అంతా తెలుసు కానీ అసమాన అవకాశాల కారణంగా అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. సాహితీ ఉత్సవంలో ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌తో మాట్లాడిన పార్వతి తిరువోతు ప్రస్తుత తరం నటీనటుల వైఖరి చాలా ఇబ్బందికరంగా ఉందని అన్నారు. పాత తరం పితృస్వామ్య వ్యవస్థ స్త్రీద్వేషంతో ప్రభావితమవుతుండగా, యువ తరం నటులు కొన్ని ఇతర కారణాల వల్ల నిరాశకు గురవుతున్నారని అన్నారు. పాత తరం అనుభవిస్తున్న ప్రయోజనాలను అందుకోలేక నేటితరం నిరాశకు గురవుతున్నారని వ్యాఖ్యానించారు."ఆల్ఫా మగ భావనలతో కొన్ని పెద్ద సినిమాలు తీసారు .. మహిళల గురించి పాత భావనలను తిరిగి తీసుకురావడానికి ఇలాంటివి తీసారు" అని పార్వతి తిరువోతు అన్నారు. తాను గతంలో ఓ సినిమా చూశానని, భవిష్యత్ లో మళ్లీ ఇలాంటి వారితో కలిసి పనిచేయాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందానని వ్యాఖ్యానించారు. కొన్ని హై బడ్జెట్ చిత్రాలు పురుషాధిక్యాన్ని ప్రదర్శించి, స్త్రీద్వేషాన్ని ప్రోత్సహిస్తూనే ఉన్నాయని తన స్పీచ్ లో హైలైట్ చేసారు పార్వతి. మలయాళ బ్యూటీ పార్వతి తిరుమోతు ఇటీవల తంగళన్ చిత్రంలో కీలక పాత్రలో నటించిన సంగతి తెలిసిందే.

# సంయుక్త మీనన్ అద్భుతమైన లుక్స్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com